



స్థానిక ఎన్నికల్లో కూటమికి పట్టాభిషేకం

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

- వివరాలు 5 లో..



సీఎం చంద్రబాబు ఏరియల్ వ్యూ

గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో పంట నష్టం, ముంపు ప్రాంతాల పరిశీలన

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 'మురసు' తుఫాను ధాటికి దెబ్బతిన్న పలు జిల్లాల్లో ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం ఏరియల్ వ్యూ నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలను ఆకాశ మార్గం ద్వారా పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చిన గంజాం, చీరాల, బాపట్ల తదితర ప్రాంతాల్లో తుఫాను వల్ల జరిగిన నష్టాన్ని సీఎం ప్రత్యక్షంగా తిలకించారు. వివిధ ప్రాంతాల్లో నీట మునిగిన విస్తారమైన పంట పొలాలను, వరద నీరు చుట్టుముట్టిన గ్రామాలు, దిగ్బంధమైన ప్రధాన రహదారులను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని, బాధితులకు అవసరమైన సహాయాన్ని తక్షణం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. 2

వాగులు, వంకలు పొంగుతున్నాయి...

అప్రమత్తంగా ఉండండి

లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి

ముంపు ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టండి

అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం 2

ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల ఏరియల్ వ్యూ అనంతరం ఆయన సచివాలయం లోని ఆర్‌టీజీఎస్ నుంచి ఉన్నతాధికా రులు, కలెక్టర్లతో సమీక్షించారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంపై ఆరా తీసిన సీఎం వేలేరుపాడు మండలంలో ప్రభావితమైన ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించా లని ఆదేశించారు. బాధితులు 'మనమిత్ర' యాప్ ద్వారా సమస్యలను నేరుగా సీఎంవోకు తెలియజేయవచ్చన్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో ముంపును వెంటనే క్లియర్ చేయాలని, రహదారులపై రవాణాకు ఆటంకం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా జాతీయ పరీక్షా విధానం

- హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలన్న మంత్రి లోకేష్
- సీఎంతో సమావేశమైన ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని

4



కరువు నుంచి రైతన్న గట్టెక్కేలా ఆదుకోండి

- వ్యవసాయ రంగానికి అండగా వీబీజీ రామ్‌జీ పథకం
- డ్రాట్ కార్డుల జారీకి, జేజేఎం విస్తరణకు సహకరించాలి
- పంటల బీమా పరిహారం త్వరగా అందేలా చర్యలు
- కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్రం ఉదారంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగానికి అండగా నిలిచేలా వీబీజీ రామ్‌జీ పథకంలో పని దినాలను 200కు పెంచాలని కోరారు. అర్హులైన కరవు బాధితులకు డ్రాట్ కార్డులు జారీ చేయడంతో పాటు పంటల బీమా పరిహారాన్ని త్వరగా అందించాలన్నారు. కరవు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ (ఐఎంసీటీ) బుధవారం సీఎం చంద్రబాబును కలిసింది. ఈ సందర్భంగా వారు తమ అధ్యయన వివరాలను వివరించారు. జల్‌జీవన్ మిషన్‌ను విస్తరించి గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి, అనుసంధానానికి కేంద్రం సహకరించాలని వారికి సీఎం విజ్ఞప్తి చేశారు. 15 రోజుల్లో కేంద్రానికి నివేదిక సమర్పిస్తామని బృందం సభ్యులు ముఖ్యమంత్రికి తెలిపారు. 3

గెలిచిన కూటమి అభ్యర్థులకు

వైసీపీ నేతల బెదిరింపులు

'రఫా రఫా' అంటూ కూటమి విజేతలపై వైసీపీ నేతల గూండాయిజం

కూటమి విజేతలకు పోలీసులు భద్రత కల్పించాలి 10

రాష్ట్ర ఎన్నికల అధికారులకు తెలుగుదేశం పార్టీ నేతల ఫిర్యాదు



నేడు యథావిధిగా 'పరిషత్' ఎన్నికలు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జిల్లా, మండల పరిషత్ ఎన్నికలను గురువారం యథావిధిగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిర్ణయించింది. ఇటీవల కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టాయని కలెక్టర్ల నుంచి అందిన నివేదికలను పరిశీలించిన అనంతరం కమిషన్ ఈ నిర్ణయానికి వచ్చింది. కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా పోలింగ్ నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేవని కలెక్టర్లు తమ నివేదికలో వెల్లడించారు. దీని ఆధారంగా ఎన్నికల ప్రక్రియను ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించింది.

23న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నిక



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు తేలాయి. డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎంపిక కోసం షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా విడుదల చేశారు. ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్‌పర్సన్లు, మేయర్లకు 18వ తేదీలోపు ఎన్నికల నోటీసులు జారీ చేస్తారు. 23న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్లకు పరోక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. అనివార్య కారణాల వల్ల ఆరోజు సాధ్యం కాకపోతే మరుసటి రోజైన 24న ప్రక్రియ పూర్తి చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది.... వివరాలు 7లో






వాగులు, వంకలు పొంగుతున్నాయి...

అప్రమత్తంగా ఉండండి

- **లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించండి**
- **ముంపు ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టండి**
- **అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం**

అమరావతి (చైతన్యరథం): ఏలూరు జిల్లాలో వరదల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో గండి ప్రభావంపై ఆరా తీశారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మనమిత్ర యాప్ ద్వారా బాధితులు తమ సమస్యలను వెంటనే సీఎంవో సిబ్బందికి తెలియజేయాలని దిశానిర్దేశం చేశారు.



గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు.. అధికారుల వివరణ

ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాలైన బుట్టాయగుడెం, వేలేరుపాడు, పోలవరం మండలం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం తదితర గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నట్టు అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండిపోయి పొంగిపొర్లుతున్నాయని ఏలూరు జిల్లా కలెక్టర్ తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని తుఫాను ప్రభావిత ప్రాంతాల ఏరియల్ వ్యూ అనంతరం సీఎం చంద్రబాబు సచివాలయంలోని రియల్‌టైం గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) నుంచి అధికారులతో సమీక్షించారు. సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు హాజరు కాగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు.

ముంపు ప్రాంతాలను త్వరితగతిన క్లియర్ చేయాలి

తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వివిధ వాగులు, కాలువలకు వరద ప్రవాహాలు పెరిగాయని తెలిపారు. ఎర్ర కాలువ, గోనెల వాగు తదితర ప్రాంతాలకు నీటి ప్రవాహాలు వస్తున్నాయని అధికారులు వివరించారు. తెలంగాణలో కురిసిన వర్షాల కారణంగా ఈ కాలువలకు వరద వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. కారంచేడు నుంచి కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు ముంపు ప్రాంతాలను త్వరితగతిన క్లియర్ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. రహదారులపై రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా వివిధ వాగులు, వంకలకు వస్తున్న వరద ప్రవాహాలపై అధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఏపీలో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని తెలిపారు. కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు ప్రకాశం బ్యారేజీకి 25,375 క్యూసెక్కుల వరద నీరు చేరిందన్నారు. నల్లమడ డ్రెయిన్‌కు 47వేల క్యూసెక్కులు, ఎర్ర కాలువకు 19,756 క్యూసెక్కుల మేర వరద ప్రవాహం చేరిందని వెల్లడించారు. తమ్మిలేరు, గోనెల వాగుకు 5,500 క్యూసెక్కులు, పెద్ద వాగుకు 9,500 క్యూసెక్కుల మేర వరద ప్రవాహాలు చేరాయని వివరించారు. పొంగిపొర్లుతున్న వాగుల కారణంగా వివిధ మార్గాల్లో రాకపోకలపై జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.









కరువు నుంచి రైతన్న గట్టెక్కేలా ఆదుకోండి

- వ్యవసాయ రంగానికి మద్దతుగా వీబీ జీ రామ్ జీ పథకం
- డ్రాట్ కార్డుల జారీకి, జేజేఎం విస్తరణకు సహకరించాలి
- పంటల బీమా పరిహారం త్వరగా అందేలా చర్యలు
- కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను తీర్చేలా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల అంచనా కోసం రాష్ట్రంలో పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) బుధవారం ముఖ్యమంత్రిని కలిసింది. ఈ నెల 2, 3 తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో పర్యటించిన సభ్యులు తమ కరువు అధ్యయన వివరాలు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలోని తీర ప్రాంతం తుఫాన్ల సమస్యతో ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్-నినో కారణంగా రాయలసీమ సహా ఇంకొన్ని ప్రాంతాలు తీవ్ర కరవుతో అల్లాడుతున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆ బృందానికి వివరించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, పంట నష్టాలు, రైతుల సమస్యలు, ప్రభుత్వం చేపడుతున్న ఉపశమన చర్యలపై స్పష్టత లభించిందని వెల్లడించారు. రాష్ట్రంలో వర్షపాతం ఈ ఏడాది సాధారణం కంటే గణనీయంగా తక్కువ నమోదైందని, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఐఎంసీటీ సభ్యులకు ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, సాగునీటితో పాటు తాగునీరు, పశుగ్రాసం సమస్యలు కూడా తలెత్తాయని వివరించారు. అనంతపురం జిల్లాలో దేశంలోనే రెండో అత్యల్ప వర్షపాతం నమోదైన పరిస్థితిని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 412 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి వారం రోజుల్లో కరువు పరిస్థితులపై కేంద్రానికి నివేదిక కూడా సమర్పిస్తామని సీఎం చెప్పారు.

వీబీ జీ రామ్ జీ పనిదినాలను 200 రోజులకు పెంచాలి

ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయితే ప్రకృతి వ్యవసాయంలో క్షేత్రస్థాయిలో మానవవనరుల అవసరం ఎక్కువగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో వీబీ జీ రామ్ జీ పథకం కింద కనీస పని దినాలను 200 రోజులకు పెంచి, వ్యవసాయ రంగానికి అవసరమైన పనులకు ఈ పథకాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కేంద్ర బృందాన్ని కోరారు. దీంతో రైతులకు మానవ వనరుల సమస్య తీరడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కరువు పరిస్థితుల వల్ల రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోతోందని, వ్యవసాయ రుణాల చెల్లింపులపై కూడా ప్రభావం పడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. గతంలో రాయలసీమలో పది ఎకరాల భూమి ఉన్న రైతులకు సైతం కరువు పరిస్థితుల దృష్ట్యా రేషన్ కార్డులు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అర్హులైన కరువు బాధిత కుటుంబాలకు డ్రాట్ కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని కోరారు. దీంతో కేంద్ర సహకారంతో నిత్యావసర సరుకుల ధరలు సబ్సిడీపై అందించే వీలుంటుందని చెప్పారు. అలాగే రైతులకు రుణాల రీ షెడ్యూలింగ్ వంటి ఉపశమన చర్యలు అందేలా కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


జేజేఎం విస్తరణతో జల వనరుల బలోపేతం

వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జల మట్టాలు గణనీయంగా పడిపోయాయని ముఖ్యమంత్రి తెలిపారు. అనేక ప్రాంతాల్లో అదనంగా బోర్లు వేసినా ఆశించిన ఫలితం ఉండటం లేదని వివరించారు. అందువల్ల తాత్కాలిక నీటి సరఫరా చర్యలతో పాటు శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పథకాన్ని మరింత విస్తరించి గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను అభివృద్ధి చేయడం, అనుసంధానించడం వంటి సమర్థ నీటి నిర్వహణ పనులకు కేంద్రం సహకరించాలని కోరారు. కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పంటల బీమా పరిహారంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే పంటల బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా త్వరితగతిన రైతుల ఖాతాల్లో పరిహారం జమయ్యేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కోరారు. రైతులకు సకాలంలో పరిహారం అందితే తదుపరి పంటల సాగుకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని వివరించారు. కరువు ప్రభావం వ్యవసాయానికే పరిమితం కాకుండా పశు సంపద, గ్రామీణ జీవనోపాధిపై కూడా పడుతున్నందున పశుగ్రాసం, తాగునీటి సరఫరా వంటి అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

15 రోజుల్లో కేంద్రానికి ఐఎంసీటీ నివేదిక

రాష్ట్రంలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను, రైతుల సమస్యలను పరిశీలించింది. రైతులతో నేరుగా మాట్లాడి పరిస్థితులను తెలుసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనల ఆధారంగా 15 రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని బృందం తెలిపింది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహాయంపై తదుపరి చర్యలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ఒకవైపు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొనగా మరోవైపు కోస్తాంధ్ర జిల్లాల్లో తుఫాన్ల కారణంగా పంటలు, ఇతర రంగాలకు నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ విభిన్న ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో రాష్ట్రాన్ని ఆదుకునేందుకు కేంద్రం ప్రత్యేకంగా స్పందించి తగిన సహాయం అందించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

మండలి చైర్మన్‌గా శాసన వ్యవస్థపై ప్రత్యేక ముద్ర వేశారు



చక్రపాణి మృతికి సీఎం చంద్రబాబు సంతాపం

అమరావతి (చైతన్యరథం): 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్, ప్రజా జీవితంలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఎ.చక్రపాణి మరణం విచారకరం. శాసనమండలి చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు, శాసన వ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టడంలో ఆయన చూపిన నిబద్ధత చిరస్మరణీయం. మండలి చైర్మన్‌గా ఆయన శాసన వ్యవస్థపై ప్రత్యేక ముద్ర వేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. చక్రపాణి కుటుంబ సభ్యులకు సీఎం సానుభూతి తెలియజేశారు.

చక్రపాణి మృతికి లోకేష్ సంతాపం

అమరావతి (చైతన్యరథం): 'ఉమ్మడి ఏపీ శాసనమండలి మాజీ చైర్మన్ ఎ.చక్రపాణి పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో విశేష కృషి చేశారు. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో నిబద్ధతతో ప్రజలకు సేవలందించారు. ఆయన మరణం విచారకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.' అంటూ చక్రపాణి మృతికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



సీఎం సహాయ నిధికి 'విట్' రూ.కోటి విరాళం

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి సహాయ నిధికి అమరావతిలోని వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) రూ. కోటి విరాళం అందజేసింది. ఆ సంస్థ చైర్మన్ జి.విశ్వనాథన్ బుధవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో ఏపీ తీవ్రంగా నష్టపోయిందని... తుఫాను బాధితులకు సహకారం అందించేలా వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ విరాళాన్ని అందిస్తోందని విశ్వనాథన్ వివరించారు. విరాళం ఇచ్చిన విట్ ప్రతినిధులను సీఎం చంద్రబాబు అభినందించారు.

చైతన్యరథం

అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా

జాతీయ పరీక్షా విధానం







- **అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతో అత్యుత్తమ విధాన రూపకల్పన**
- **హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు**
- **విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చూడాలన్న మంత్రి లోకేష్**
- **సీఎంతో సమావేశమైన ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని**

అమరావతి (చైతన్యరథం): విభిన్న రాష్ట్రాలు, భాషలు కలిగిన భారతదేశంలో అందరినీ కలుపుకొని వెళ్లేలా జాతీయ పరీక్షా సంస్కరణలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఏకాభిప్రాయంతో పారదర్శకమైన, విశ్వసనీయమైన జాతీయ పరీక్షా విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు. దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థికైనా, ఏ భాష మాట్లాడే విద్యార్థికైనా సమాన అవకాశాలు, న్యాయం జరిగేలా సంస్కరణలు ఉండాలని స్పష్టం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. సచివాలయానికి వచ్చిన నందన్ నీలేకనికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో జాతీయ పరీక్షా విధానంపై టాస్క్ ఫోర్స్‌కు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. నేటి తరం విద్యార్థులు, యువత ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరీక్షల విధానం ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. కేవలం పరీక్షలు, మార్కులకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యం పెంపొందించేలా విద్యా విధానాన్ని తీర్చిదిద్దాలని అభిప్రాయపడ్డారు. మంత్రి లోకేష్ ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న విధానాలు, సాంకేతికత వినియోగాన్ని వివరించారు. దేశవ్యాప్తంగా పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై తన ఆలోచనలను పంచుకున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గేలా పరీక్షల విధానాన్ని రూపొందించాలని లోకేష్ సూచించారు. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లి చదువుకోవాలన్నా, ఉద్యోగం చేయాలన్నా భాష, విద్యా విధానం, ధ్రువీకరణలపరంగా ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ స్థాయిలో సమన్వయం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో డేటా లేక్ ద్వారా వివిధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని సమీకరించి, నిర్ణయాలు తీసుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

పరీక్షల విధానంలో సమూల మార్పుల దిశగా...

పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీలను అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, డిజిటల్ ఫోరెన్సిక్స్ విభాగా లను బలోపేతం చేయడం వంటి అంశాలపై తాము ప్రత్యేక దృష్టి సారించినట్టు టాస్క్‌ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని తెలిపారు. వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నామని... ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలు, ఎదురవుతున్న సమస్యలు, సంస్కరణలపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు చెప్పారు. ఏపీ అమలు చేస్తున్న విధానాలపై ఆసక్తి కనబరిచారు.


జిల్లా, మండల పీఠాలనూ మనమే దక్కించుకోవాలి

- **జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించాలి**
- **కూటమి పార్టీల ముఖ్య నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): గురువారం జరగబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో అన్ని స్థానాలపై కూటమి అభ్యర్థులే దక్కించుకోవాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబునాయుడు కోరారు. బుధవారం ఆయన అమరావతిలో కూటమి పార్టీల ముఖ్య నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... ప్రజలకు మనం అండగా నిలిస్తే వారు మనతోనే ఉంటారని మున్సిపల్, కార్పొరేషన్ల ఎన్నికల ఫలితాల ద్వారా నిరూపితమైందన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలను ఆయన అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 95 శాతం స్ట్రైక్ రేట్ సాధించామన్నారు.

వారికి నామినేటెడ్ పోస్టులు

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లల్లో దక్కిన విజయం మన బాధ్యతను పెంచిందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ ఫలితాలు కూటమి సంక్షేమం–అభివృద్ధి–సుపరిపాలనకు గుర్తింపుగా అభివర్ణించారు. స్థానిక ఎన్నికల్లో సీట్లు దక్కించుకోలేని వారికి నామినేటెడ్ పోస్టులతో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో అనుకున్న విధంగానే ఫలితాలొచ్చాయన్నారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. గుడ్ గవర్నెన్స్.. గుడ్ పాలిటిక్స్... ఇదే కూటమి ప్రభుత్వ విధానం అని తెలిపారు.



కూటమి ప్రభుత్వ కష్టాన్ని గుర్తించిన ప్రజలు

ప్రజలకు మంచి చేస్తే.. అన్ని స్థాయిల్లోనూ వారు గుర్తిస్తారని.. మన వెన్నంటే ఉంటారని సీఎం చంద్రబాబు చెప్పారు. పట్టణ స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాన్ని నిరూపించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని ప్రజలు గుర్తించారని వివరించారు. మంచికి.. మంచి ప్రభుత్వానికి అండగా ఉంటామని ఈ ఫలితాల ద్వారా ప్రజలు చాటి చెప్పార న్నారు. మరింత చక్కటి పాలన అందించేందుకు ప్రోత్సాహమిస్తూ ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు.

95 శాతం స్ట్రైక్ రేట్

పట్టణ స్థానిక ఎన్నికల్లో కూడా 95 శాతం స్ట్రైక్ రేట్ సాధించామని సీఎం చెప్పారు. ఓడిపోయిన కొన్నిచోట్ల కూడా కూటమి పార్టీలకు చెందిన రెబెల్స్ గెలిచారన్నారు. స్థానికంగా ఉన్న చిన్నపాటి సమన్వయ లోపాలతో కొన్ని స్థానాలు కొల్పోయా మని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధించారని సంతోషం వ్యక్తం చేశారు.

అందుకే గెలిచాం

ఆర్థిక వ్యవస్థ దివాళా తీసినా సంక్షేమాన్ని అందిస్తున్నామని.. మరోపక్క అభివృద్ధి చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. డీఎస్సీతో టీచర్ రిక్రూట్మెంట్ సహా జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ శాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలతో మమేకమవుతూ ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పని చేస్తున్నా మని పేర్కొన్నారు. అందుకే గెలిచి చరిత్ర సృష్టించామని సీఎం సోదాహరణంగా చెప్పారు.

మిత్రపక్షాలను గౌరవించుకోవాలి

రాష్ట్రానికి.. తమకు న్యాయం చేయాలనే ప్రజలు కూటమికి పట్టంకడుతున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. మిత్రపక్షాలను గౌరవించుకోవాలి.. కూటమిలోని ఏ పార్టీ అభ్యర్థి అయినా మన అభ్యర్థే అన్నట్టుగా పని చేయాలని కేడర్‌కు సూచించారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను మించి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాలను గెలవాలని వారికి దిశానిర్దేశం చేశారు. చిన్నపాటి పొరపాటు కూడా జరగకూడదని.. పూర్తి సమన్వయంతో పని చేయాలని పార్టీ నేతలను అప్రమత్తం చేశారు.

కూటమి ధర్మం పాటించాల్సిందే

కూటమిలో ఐక్యత ఎంత మాత్రం చెడిపోకూడదని పార్టీ నేతలకు చంద్రబాబు స్పష్టం చేశారు. కుటుంబంలోను, పార్టీలోను, సంస్థల్లోను బేధాభిప్రాయాలు ఉంటాయి. కానీ నిర్ణయం తీసుకున్న తర్వాత కట్టుబడి పని చేయాలి... కూటమి ధర్మాన్ని పాటించాలని శ్రేణులకు సూచించారు. పొత్తు ధర్మాన్ని పాటించని వారిని వదులుకోవడానికి కూడా సిద్ధమని ఈ సందర్భంగా ఆయన కుండబద్దలు కొట్టారు.

హింసను ప్రేరేపిస్తున్న గొడ్డలి పార్టీ..

సుపరిపాలనతో సమానంగా పొలిటికల్ గవర్నెన్స్ ఉండేలా చూస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గొడ్డలి పార్టీ హింసను ప్రేరేపిస్తోంది.. సంయమనం పాటించాలని పార్టీ కేడర్‌కు సూచించారు. ఓటమి తప్పదని భావించిన ఆ పార్టీ ఉనికిని చాటుకోవడానికి కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతోందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పారన్నారు. ఆ పార్టీ నేతలు సొంత బూత్‌లలోనూ గెలవలేకపోయారని వివరించారు.


టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన పార్టీ తరపున పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు కీలక నేతలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ ఫోన్



అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంపై ఆరా
ఇబ్బందులను సమర్ధవంతంగా అధిగమించారని ప్రశంస

అమరావతి (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం ఫోను చేశారు. వారం రోజుల వ్యవధిలో రాష్ట్రానికి రెండు తుఫాన్ల తాకిడి నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబు ప్రధానికి వివరించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లిందని సీఎం చెప్పారు. రహదారులు, విద్యుత్ సరఫరా సహా వివిధ రంగాలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందని... ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సాయం అందించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. తుఫాను సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం బాగా పని చేసిందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. నిరంతర అప్రమత్తతతో తుఫాను వల్ల వచ్చిన ఇబ్బందులను సమర్ధవంతంగా అధిగమించారంటూ సీఎం చంద్రబాబును ప్రధాని ప్రశంసించారు.



స్థానిక ఎన్నికల్లో కూటమికి పట్టాభిషేకం

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సాధించిన ఘన విజయంపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి కూటమి విజయంపై అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు మద్దతు పలికారన్నారు. విధ్వంసాలు, కుట్రలతో తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల మనసులు గెలవలేరని ఈ తీర్పుతో స్పష్టమైందన్నారు. కూటమి విజయానికి కృషి చేసిన భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఎన్నికల ఫలితాలు తమపై బాధ్యతను మరింత పెంచాయని, ఈ తీర్పు తమకు మరింత వినయంతో, మరింత బాధ్యతతో పనిచేయాలనే సంకల్పాన్ని ఇచ్చిందని శ్రీనివాసరావు చెప్పారు.

మున్సిపోల్స్‌లో కూటమి 95 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రాత్మక విజయం

మంత్రి లోకేష్‌ని కలిసి అభినందనలు తెలిపిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 95 శాతం స్ట్రైక్ రేట్‌తో అద్భుతమైన విజయం సాధించడంపై తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి, టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌ని కలిసి ఘన విజయంపై శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ విజయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రజలు అందించిన మద్దతుకు నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, నాయకుల సమష్టి కృషి, కార్యకర్తల అహర్నిశల శ్రమ ఈ ఘన విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రజలు మరోసారి పట్టం కట్టారన్నారు. ఈ గెలుపునకు సహకరించిన కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం మరింత కట్టుబాటుతో పని చేస్తుందని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

డీఎస్సీ-2026 సమగ్ర నోటిఫికేషన్ విడుదల

- 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన

- ఈ నెల 11 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. 2,721 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి డీఎస్సీ-2026 సమగ్ర నోటిఫికేషన్‌ను విద్యా శాఖ బుధవారం విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 2,111 రెగ్యులర్ స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటితో పాటు మిగిలిన పోస్టులకు సంబంధించి పూర్తి వివరాలను సమగ్ర నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు.

సీఎం చంద్రబాబుతో మేజర్ జనరల్ శ్రీనివాస్ భేటీ





అమరావతి (చైతన్యరథం): తెలంగాణ-ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఏపీ, తెలంగాణా రాష్ట్రాలకు సంబంధించి స్థానిక మిలటరీ లోకల్ అథారిటీగా వివిధ అంశాలను ఆయన సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సైనిక దళాలకు పూర్తిస్థాయిలో సహకారం ఉంటుందని శ్రీనివాస్‌కు చంద్రబాబు స్పష్టం చేశారు.

మైగ్రేషన్ సర్టిఫికెట్ లేకుండానే దరఖాస్తుకు అనుమతి

- తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన స్థానికులకు శుభవార్త

- ఉద్యోగ దరఖాస్తుల్లో నిబంధనలు సడలింపు

అమరావతి (చైతన్యరథం): తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలస వచ్చిన అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగ నియామకాలకు దరఖాస్తు చేసుకునే క్రమంలో నిబంధనలను సడలిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఎలాంటి మైగ్రేషన్ సర్టిఫికెట్ లేకుండానే నేరుగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు అనుమతినిచ్చింది. 2024 జూన్ 1వ తేదీలోపు తెలంగాణ నుంచి ఏపీకి వలస వచ్చిన వారికి ఈ సౌలభ్యం వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఏపీపీఎస్సీ, పోలీసు నియామక మండలి, మెడికల్ బోర్డు నియామకాలతో పాటు రాబోయే డీఎస్సీ రిక్రూట్‌మెంటుకు కూడా ఇది వర్తిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. అయితే దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వద్ద స్థానికతను రుజువు చేసే 'లోకల్ స్టేటస్' పత్రాలు తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో తెలంగాణ నుంచి ఏపీకి వచ్చిన వేలాది మంది నిరుద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది.

బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది: మంత్రి లోకేష్



అమరావతి (చైతన్యరథం): 'రాప్తాడు ఘటనలో గాయపడ్డ బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది. కొద్దిగా మాట్లాడుతోంది. ఆమెకు నోటి ద్వారా ద్రవ ఆహారం ఇవ్వడం ప్రారంభించారు. మంచంపై తేలికపాటి కదలికలు చేయిస్తున్నారు. ప్లాస్టిక్ సర్జరీ బృందం పరిశీలనలో ఉంచుతూ ఆర్థోపెడిక్ సర్జరీ నిర్వహణకు ప్లాన్ చేశారు. చిన్నారి త్వరగా పూర్తిగా కోలుకోవాలి' అంటూ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం వేదికగా ఆకాంక్షించారు.

మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో

ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- భారీ వర్షాలు, స్థానిక పరిస్థితులపై సమీక్ష..
- కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో గురువారం జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ తెలిపారు. మురసు తుపాను ప్రభావిత ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, స్థానిక పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పోలింగ్ ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాల ప్రభావం, పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులు, రవాణా సౌకర్యాలు, ఎన్నికల సిబ్బంది సంసిద్ధత, భద్రతా ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, పరిమిత సంఖ్యలో కొన్ని ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల పోలింగ్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్లు నివేదించినట్లు తెలిపారు.

వాతావరణ పరిస్థితులు, స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ఎక్కడైనా ఎన్నికల నిర్వహణకు ఇబ్బందులు ఎదురైతే క్షేత్రస్థాయి అధికారుల నుంచి వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికలు తెప్పించుకుని, వాటి ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రత కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో దాదాపు 2.52 లక్షల మంది అధికారులు, సిబ్బంది పాల్గొంటుండగా, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం సుమారు 52 వేల మంది సిబ్బంది సేవలను వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు.

రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో సిబ్బంది కొరత తలెత్తకుండా అవసరమైన సహకారం అందిస్తున్నామన్నారు. పశ్చిమగోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎదురవుతున్న రవాణా, ఇతర స్థానిక సమస్యల పరిష్కారంపై కూడా సమీక్షించినట్లు వెల్లడించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సీసీటీవీ, వీడియోగ్రఫీ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల లోపల కూడా వీడియోగ్రఫీ నిర్వహించాలని సూచించారు. అయితే ఓటు రహస్యానికి ఎలాంటి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత దృశ్యాలను తప్పనిసరిగా రికార్డు చేయాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ప్రతి ప్రిసైడింగ్ అధికారికి సంబంధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా మార్గదర్శకాలు అందించాలని, స్మార్ట్‌ఫోన్ అందుబాటులో లేని వారికి ఇతర పోలింగ్ అధికారులు లేదా పోలీసు అధికారుల ఫోన్ల ద్వారా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ లేదా ఇతర అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు ప్రిసైడింగ్ అధికారులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా జోనల్ మేజిస్ట్రేట్ లేదా పోలీసు అధికారులను సంప్రదించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని తెలిపారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగి సుమారు 2.61 కోట్లకు చేరిందని, ఈ నేపథ్యంలో మైక్రో లెవెల్ ప్లానింగ్‌తో ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని మల్లికార్జున కోరారు.

డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. గతంలో మున్సిపల్ ఎన్నికలను ఎన్నికల కమిషనర్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహించిన తరహాలోనే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను కూడా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సెక్టార్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఒకే దశలో జరుగుతున్నందున పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో ఓటర్లు వచ్చే అవకాశం ఉందని, రద్దీ నియంత్రణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, అవసరమైనచోట పోలీసు బలగాల మోహరింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణ తేజ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయని తెలిపారు. మిగిలిన 7,770 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ స్థానాల్లో మొత్తం 18,843 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టినట్లు వివరించారు.

భారీ వర్షాలపై అప్రమత్తం

- ఇరిగేషన్‌కు మంత్రి నిమ్మల ఆదేశాలు

అమరావతి (చైతన్య రథం): మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించారు.తుఫాన్, వర్షాల ప్రభావంతో తలెత్తే వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజలకు, పంట పొలాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శశిభూషణ్,అడ్వైజర్ వెంకటేశ్వర రావు, ఈఎన్‌సీ నరసింహమూర్తితోపాటు పలువురు చీఫ్ ఇంజనీర్లు (సీఈలు), సూపరింటెండింగ్ ఇంజనీర్లు (ఎస్ఈలు) పాల్గొన్నారు.మురసు తుఫాన్ ప్రభావంతో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా పర్చూరు, బాపట్ల, చీరాల, ప్రత్తిపాడు ప్రాంతాల్లో నల్లమడ, పర్చూరు డ్రెయిన్లు గరిష్ట నీటిమట్టానికి మించి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన రక్షణ చర్యలు



చేపట్టాలని మంత్రి ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా పంట పొలాల్లో నిలిచిన నీటిని కెనాల్స్, డ్రైన్ల ద్వారా వీలైనంత త్వరగా బయటకు పంపించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుడమేరు, ఎర్రకాలువ,గోనెలవాగు,తమ్మిలేరు, ఏలేరు తదితర జలవనరులు, రిజర్వాయర్లకు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులనుంచి ప్రకాశం బ్యారేజీకి 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బుడమేరు క్యాచ్‌మెంట్ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలోకి మళ్లిస్తున్నామని తెలిపారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన ఫ్లడ్ మేనేజ్ మెంట్ చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మరోవైపు, గత రెండు రోజులుగా విజయవాడలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎనికేపాడు అండర్ టన్నెల్ (యూటీ) నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి తరలిస్తున్నట్లు వివరించారు. ఉత్తర కోస్తా జిల్లాల్లోనూ భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వరద నీటి ప్రవాహం, డ్రైనేజీ వ్యవస్థల పనితీరుపై నిరంతర నిఘా ఉంచి, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

అత్యవసర సాయం కోసం

'మనమిత్ర' వాట్సాప్ వినియోగించండి

- వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆర్టీజీఎస్ అధికారుల సూచన



అమరావతి (చైతన్యరథం): మురసు తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అత్య వసర సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వర్షాలు, వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు తక్షణ సహాయం కోసం 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009ను సంప్రదించాలని రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టమ్ (ఆర్టీజీఎస్) అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సంప్రదించేందుకు 112, 1070, 18004250101 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయినా, విద్యుత్ సరఫరా నిలిచిపోయినా, చెట్లు కూలి పోయినా, రహదారులు తెగిపోయినా ప్రజలు తమ సమస్యలను మనమిత్ర వాట్సాప్ నంబర్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే మంచినీరు, ఆహారం తదితర అత్యవసర అవసరాలకు సంబంధించిన సమస్యలను కూడా మనమిత్రలో ఫొటోలు, వివరాలతో షేర్ చేయవచ్చని పేర్కొన్నారు. ప్రజలు పంపిన ఫిర్యాదులు, సమస్యలను తక్షణమే సంబంధిత ప్రాంతాల అధికారులకు చేరవేసి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీజీఎస్ అధికారులు వెల్లడించారు. తుఫాన్,భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులోఉన్న హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వేగంగా రహదారుల పునరుద్ధరణ

- యుద్ధప్రాతిపదికన చర్యలకు ఆదేశాలు
- 162.841 కి.మీ. మేర రహదారులకు నష్టం..
- తాత్కాలిక, శాశ్వత మరమ్మతులకు రూ.143.36 కోట్లు అవసరం
- మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడి

అమరావతి (చైతన్య రథం): మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలకు రవాణాపరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రహదారులపై తాత్కాలిక మరమ్మతులను వేగవంతం చేయాలని, అనంతరం శాశ్వత పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 162.841 కిలోమీటర్ల మేర ప్రధాన జిల్లా రహదారులు, రాష్ట్ర రహదారులు దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు మంత్రి వెల్లడించారు. రెండు చోట్ల స్కార్స్, నాలుగు ప్రాంతాల్లో రోడ్డు కోతలు, ఐదు చోట్ల కల్వర్టు నిర్మాణ పనులకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తుఫాన్ కారణంగా 201 చెట్లు నేలకూలగా, వాటన్నింటినీ తొలగించే ప్రక్రియ



ఇప్పటికే పూర్తయిందని పేర్కొన్నారు. మొత్తం 73 ప్రాంతాల్లో ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడగా, ఇప్పటికే 34 ప్రాంతాల్లో రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు. మిగిలిన ప్రాంతాల్లోనూ రహదారుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి, సాధ్యమైనంత త్వరగా రవాణా సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాల వారీగా రహదారులకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తే.. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 66.600 కిలోమీటర్లు, నెల్లూరు జిల్లాలో 52.683 కిలోమీటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 38.572 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 3.600 కిలోమీటర్లు, పల్నాడు జిల్లాలో 1.386 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు మంత్రి తెలిపారు. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు రూ.16.66 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసినట్లు వెల్లడించారు. శాశ్వత మరమ్మతులకు మరో రూ.126.70 కోట్లు అవసరమని, మొత్తంగా రహదారుల పునరుద్ధరణకు రూ.143.36 కోట్ల నిధులు అవసరమవుతాయని పేర్కొన్నారు.

తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గేవరకు ఆర్ అండ్ బీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టడంతోపాటు, రహదారులు దెబ్బతిన్న, ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో ముందస్తుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పునరుద్ధరణ పనులకు అవసరమైన యంత్రాలు, సిబ్బందిని ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, పునరుద్ధరణ పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈవీఓఐలో దేశంలోనే ఏపీ టాప్

- సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఏపీ రవాణా శాఖ పనితీరుకు జాతీయ గుర్తింపు
- ఈవీఓఐ-2026లో ఏపీ అగ్రస్థానంపై రవాణా అధికారులకు మంత్రి మండిపల్లి అభినందనలు



అమరావతి (చైతన్య రథం): ఈజ్ ఆఫ్ వెహికల్ ఓనర్‌షిప్ ఇండెక్స్ (ఈవీఓఐ)-2026లో ఆంధ్రప్రదేశ్ దేశంలోని 15 రాష్ట్రాల్లో ప్రథమ స్థానాన్ని సాధించడంపై రాష్ట్ర రవాణా, యువజన క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ఈ గుర్తింపురావడం ఎంతో గర్వకారణమని సచివాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. న్యూఢిల్లీలో నవంబర్ 4న ఇండియాటెక్.ఆర్గ్, కన్స్యూమర్ వాయిస్ సంయుక్తంగా విడుదలచేసిన ఈసూచీలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం రాష్ట్రంలో రవాణాశాఖ చేపడుతున్న సంస్కరణలు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. వాహనాల యాజమాన్య బదిలీ ప్రక్రియను మరింత సులభతరం చేయడం, బయోమెట్రిక్ ప్రీ-ఆథెంటికేషన్ విధానంద్వారా పార దర్శకతను పెంపొందించడం, డిజిటల్ సేవలను విస్తరించడం వంటి చర్యలు రాష్ట్రానికి ఈ గుర్తింపు తీసుకువచ్చాయని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా కేంద్రీకృత పాలనకు ప్రాధాన్యతనిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రభుత్వసేవలను ప్రజలకు మరింత చేరువచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ విజయానికి కృషిచేసిన రవాణా శాఖ అధికారులకు,సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ సేవల్లో పారదర్శకత, వేగం,నాణ్యతను పెంచు తూ ప్రజలకు మరింత మెరుగైన రవాణాసేవలు అందించేందు కు కృషిచేస్తామని మంత్రి మండిపల్లి స్పష్టం చేశారు.

రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరిట మోసాలు:

ఏజెంట్ల పట్ల అప్రమత్తం

- యువతకు రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరిక..
- ఆకర్షణీయమైన వేతనాలు, విదేశీ ఉద్యోగాల హామీలను నమ్మవద్దని సూచన

అమరావతి (చైతన్య రథం): రష్యా సైన్యంలో ఉద్యోగాల పేరుతో భారతీయ యువతను మోసం చేస్తూ, వారిని ప్రమాదకర పరిస్థితుల్లోకి నెడుతున్న ఏజెంట్లపట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన యువతను లక్ష్యంగా చేసుకుని కొన్ని ప్రైవేట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అక్రమ ఏజెంట్లు విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతోందని పేర్కొంది. విదేశాల్లో మంచి ఉద్యోగాలు, అధిక వేతనాలు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామంటూ యువతను నమ్మించి రష్యాకు పంపుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అక్కడికి చేరుకున్న అనంతరం వారిపై ఒత్తిడి తెచ్చి సైన్యంలో చేరేలా చేస్తున్నట్లు, అధిక వేతనాల ఆశ చూపడం లేదా తప్పుడు కేసుల్లో ఇరికించి బలవంతంగా సైనిక కార్యకలాపాల్లో పాల్గొనేలా చేస్తున్నట్లు పలు ఆందోళనకర ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపింది. ఈ పరిణామాలు యువత ప్రాణాలకు ముప్పుగా మారడంతోపాటు వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది.

విదేశీ ఉద్యోగాల పేరుతో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలు, అధిక వేతనాల హామీలు, సులభమైన నియామక ప్రక్రియలు, తక్కువ వ్యవధిలో విదేశాలకు పంపిస్తామనే వాగ్దానాలను గుడ్డిగా నమ్మవద్దని హెచ్చరించింది. గుర్తింపు, ప్రభుత్వ అనుమతులు లేని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు, అనధికారిక ఏజెంట్ల ద్వారా విదేశీ ఉద్యోగాలకు వెళ్లడం ప్రమాదకరమని స్పష్టం చేసింది. విదేశాలకు వెళ్లే ముందు ఉద్యోగ ఒప్పందాలు, వీసా వివరాలు, ఉద్యోగ స్వరూపం, నియామక సంస్థల చట్టబద్ధత, విశ్వసనీయతను సంబంధిత అధికారిక సంస్థల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించింది. ముఖ్యంగా ఉద్యోగాల పేరుతో రష్యా లేదా ఇతర దేశాలకు తీసుకెళ్లి, సైనిక శిక్షణ లేదా సైన్యంలో చేరేలా ఒత్తిడి చేసే మోసపూరిత ప్రయత్నాలపట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. ఇటువంటి అనుమానాస్పద ఉద్యోగ ఆఫర్లు, ఏజెంట్లు, సంస్థల వివరాలు తెలిస్తే సంబంధిత ప్రభుత్వ అధికారులకు లేదా పోలీసు శాఖకు సమాచారం అందించాలని సూచించింది. విదేశీ ఉద్యోగాలపై తొందరపాటు నిర్ణయాలు తీసుకుని జీవితాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని, పూర్తి స్థాయి విచారణ, ధృవీకరణ అనంతరమే విదేశీ ఉపాధి అవకాశాలపై ముందడుగు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం యువతకు విజ్ఞప్తి చేసింది.

నేడు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

- 20 జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు..
- ఆకస్మిక వరదలపట్ల అప్రమత్తంగా ఉండాలి: ఏపీఎస్డీఎంఏ



అమరావతి (చైతన్య రథం): మురసు తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం కూడా పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, నంద్యాల, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఉధృతంగా ప్రవహించే వాగులు, కాలువలు, నీటిలో మునిగిపోయిన కాజ్‌వేలను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. మరోవైపు బుధవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. సాయంత్రం 6 గంటల సమయానికి ఏలూరు జిల్లా బయ్యనగూడెంలో అత్యధికంగా 182.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లాలోని జీలుగుమిల్లిలో 139.63 మి.మీ., పి.నారాయణపురంలో 128.75 మి.మీ., నూతిరామన్నపాలెంలో 122 మి.మీ. వర్షం కురిసింది. కాకినాడ జిల్లాలోని ఆర్యవటంలో 126.25 మి.మీ., పెదపూడిలో 123.69 మి.మీ., కాజులూరులో 121.08 మి.మీ., కరపలో 120.25 మి.మీ., వేళంగిలో 114.01 మి.మీ., జి.మామిడలో 112.75 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, వరద ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో ప్రయాణాలకు దూరంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

100 పట్టణ స్థానిక సంస్థల్లో

పరోక్ష ఎన్నికలకు షెడ్యూల్ ఖరారు

- 23న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు..
- 18వ తేదీలోపు ఎన్నికల నోటీసుల జారీ

విజయవాడ(చైతన్య రథం): రాష్ట్రంలోని 87మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, 13మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఖరారు చేసింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 18లోపు ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్‌పర్సన్లు, మేయర్లకు ఎన్నికల నోటీసులు జారీ చేయనుండగా, నవంబర్ 23న డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు నిర్వహించనున్నారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ల ఎన్నికలను పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. ఆయా స్థానిక సంస్థల్లో ఎన్నికైన వార్డు సభ్యులు తమలో ఒకరిని వైస్‌చైర్‌పర్సన్‌గా లేదా డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకుంటారని కమిషనర్ వివరించారు. ఈ నెల 18వ తేదీలోపు ఎన్నికల నోటీసులు జారీ చేసి, పరోక్ష ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఎన్నికల నిబంధనలు, చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఏదైనా అనివార్య కారణాల వల్ల నవంబర్ 23న పరోక్ష ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోతే, మరుసటి రోజు అంటే నవంబర్ 24న ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. మొత్తంగా 100 పట్టణ స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు కావడంతో ఆయా సంస్థల్లో పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ మరో కీలక దశకు చేరుకోనుంది. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా పిలుపునిచ్చారు.

పరోక్ష ఎన్నికల షెడ్యూల్:

- మున్సిపాలిటీలు /నగర పంచాయతీలు: 87
- మున్సిపల్ కార్పొరేషన్లు: 13
- ఎన్నికల నోటీసుల జారీ: నవంబర్ 18, 2026లోపు
- పరోక్ష ఎన్నికల తేదీ: నవంబర్ 23, 2026
- ప్రత్యామ్నాయ తేదీ: నవంబర్ 24, 2026

చైతన్యరథం

తుపాను నష్టంపై ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు

- విద్యుత్ పునరుద్ధరణ పనులు సాయంత్రంలోగా పూర్తి చేస్తాం
- పల్నాడు జిల్లాలో పంట నష్టాల పరిశీలన..
- రైతులకు మంత్రి గొట్టిపాటి భరోసా
- రెండు వేల మందికిపైగా ఇతర రాష్ట్రాల సిబ్బందితో సహాయక చర్యలు



చిలకలూరిపేట /అద్దంకి (చైతన్య రథం): తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న ప్రతి రైతునూ గుర్తించి, నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. బుధవారం తొలుత పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట పరిసర తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటితో కలిసి పర్యటించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టాన్ని రైతులు మంత్రికి వివరించారు. అర్హులైన ఏ ఒక్క రైతూ నష్టపరిహారం అందకుండా మిగిలిపోకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం అద్దంకిలో పర్యటించిన మంత్రి.. తుపాను ప్రభావం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై వివరాలు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందస్తు జాగ్రత్తలు, సమన్వయంతో అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయడం వల్ల ప్రాణనష్టం జరగకుండా పరిస్థితిని ఎదుర్కోగలిగామని తెలిపారు. తుపానుకు రెండు రోజుల ముందే విద్యుత్ సిబ్బందిని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేశామని చెప్పారు.

మూడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం

తుపాను ప్రభావంతో ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రజలు గతరెండు రోజులుగా విద్యుత్ అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. సరఫరాను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కర్ణాటక, తమిళనాడు నుంచి రెండు వేల మందికిపైగా సిబ్బంది వచ్చి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వెల్లడించారు. ఏపీఎస్పీడీసీఎల్ నుంచి మరో వెయ్యి మంది సిబ్బందిని ప్రకాశం, పల్నాడు జిల్లాలకు పంపినట్లు చెప్పారు. సీఎండీ నుంచి లైన్‌మెన్ వరకు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సేవలందిస్తూ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారని వివరించారు. తెగిపడిన విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బుధవారం సాయంత్రంలోగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని మంత్రి స్పష్టంచేశారు. ప్రజలకు విద్యుత్‌సరఫరా పునరుద్ధరించే క్రమంలో సిబ్బంది భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన చోట అదనపు సిబ్బంది, సామగ్రిని వినియోగించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



బాపట్ల జిల్లాలోనూ తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన

అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లాలో పర్యటించారు. పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో మురసు తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పురోగతిని సమీక్షించారు.

కర్ణాటకలోని గుల్బర్గా నుంచి వచ్చి సేవలందిస్తున్న విద్యుత్ సిబ్బందిని కలిసి వారి పనితీరును అభినందించారు. చీరాలలో తమిళనాడు నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బంది చేపడుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి వారితో మాట్లాడారు. తుపాను వంటి క్లిష్ట పరిస్థితుల్లో సొంత ప్రాంతాలను విడిచి వచ్చి ప్రజలకు విద్యుత్ సేవలు అందిస్తున్న సిబ్బందికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

తుపాను కారణంగా నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులకు అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య పాల్గొన్నారు.

ప్రజా తీర్పును గౌరవించాలి

- వ్యవస్థలను కించపరచడం జగన్‌కు తగదు
- స్థానిక ఎన్నికల్లో కూటమికే ప్రజా మద్దతు
- అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు ప్రజామోదం
- ఎమ్మెల్సీ వర్ల రామయ్య

అమరావతి (చైతన్య రథం): పురపాలక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి అఖండ విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల తరఫున ఎమ్మెల్సీ, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా తీర్పును గౌరవించకుండా ఎన్నికల వ్యవస్థలను కించపరచడం వైసీపీ అధినేత జగన్‌కు తగదని హితవు పలికారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లకు ప్రజా వ్యతిరేకత ఎదుర్కొంటుందని, అయితే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ మరింత పెరిగిందని వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకతకు బదులుగా అనుకూలత స్పష్టంగా కనిపించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, సుపరిపాలన లక్ష్యంగా చంద్రబాబు సాగిస్తున్న పాలనను ప్రజలు మనస్ఫూర్తిగా ఆమోదించారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గతంలో సాగిన విధ్వంసం, అరాచకాలు, బెదిరింపులు, దౌర్జన్య రాజకీయాలను ప్రజలు తిరస్కరించారన్నారు. 'రఫ్ఫా రఫ్ఫా.. పీకలు కోస్తాం' అంటూ భయభ్రాంతులకు గురిచేసే సంస్కృతికి ఎన్నికల్లో గట్టి సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ పేపరైనా ప్రజా తీర్పు కూటమికే అనుకూలంగా ఉంటుందని ఫలితాలు నిరూపించాయన్నారు.

శ్రీకాకుళం నుంచి కుప్పం వరకు ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగాయని, ముఖ్యంగా పులివెందులలో గత నాలుగు దశాబ్దాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించారని వర్ల రామయ్య పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే ప్రజా తీర్పు ఎంత స్పష్టంగా ఉంటుందో పులివెందుల ఫలితం చాటిచెప్పిందన్నారు. ప్రజా తీర్పును అంగీకరించకుండా వ్యవస్థలపై నిందలు వేయడం మానుకోవాలని జగన్‌కు సూచించారు.

సంక్షేమ పథకాలకు ప్రజామోదం

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, దీపం, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల వంటి పథకాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని వర్ల రామయ్య అన్నారు. గత



ప్రభుత్వం మూసివేసిన అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి, కేవలం రూ.5కే పేదలకు భోజనం అందించడం అభినందనీయమన్నారు. ఇటీవల పామర్రు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను తాను సందర్శించానని, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందిస్తున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లు, కూలీలు, సామాన్యులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారని చెప్పారు. పేదలకు ఉపయోగపడుతున్న అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు.

లోకేష్ హామీలకు ప్రజల మద్దతు

యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీల మేరకు పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన దిశగా చేస్తున్న కృషిని ప్రజలు ఆదరిస్తున్నారని వర్ల రామయ్య అన్నారు.రాష్ట్రానికి రూ.26లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, తద్వారా 24లక్షల ఉద్యోగాల కల్పనకుమార్గంసుగమం చేశారన్నారు. 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకునే దిశగా లోకేష్ ముందుకు సాగుతున్నారన్న నమ్మకం యువతలో ఉందన్నారు. అమరావతి నిర్మాణంతోపాటు పోలవరం, వెలుగొండ, పట్టిసీమ, హంద్రీ-నీవా ప్రాజెక్టుల పనులను ముందుకు తీసుకెళ్తూ రైతాంగానికి సాగునీటి భరోసా కల్పిస్తున్న విధానాన్ని ప్రజలు మెచ్చుకున్నారని చెప్పారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ విజయం తమకు గర్వ కారణం కాదని, ప్రజలపట్ల బాధ్యతను మరింత పెంచిందని వర్ల రామయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారం, బీజేపీ భాగస్వామ్యంతో ప్రజలకు మరింత నిబద్ధతతో సేవ చేస్తామని తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి ఇదే విధంగా మద్దతు ఇవ్వాలని కోరారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు భరోసా, కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తామని ఎమ్మెల్సీ వర్ల స్పష్టం చేశారు.

అభివృద్ధికి ప్రజలు పట్టంగట్టారు

- **27 నెలల కూటమి పాలనకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనం**
- **సంక్షేమం, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధికి ప్రజామోదం**
- **మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బోండా ఉమా**

మంగళగిరి (చైతన్య రథం): గత 27 నెలలుగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమైన మద్దతు ప్రకటించారని ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన రాష్ట్ర ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో ప్రజలు 164 స్థానాలతో కూటమికి తిరుగులేని మెజారిటీ అందించారని, ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సాగించిన పాలనకు తాజా స్థానిక ఎన్నికల విజయమే నిదర్శనమని బోండా ఉమా పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 కార్పొరేషన్లు, 83 మున్సిపాలిటీల్లో ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. 2021లో వైసీపీ పాలనలో జరిగిన స్థానిక ఎన్నికలు రాష్ట్రానికి పీడకలగా మిగిలిపోయాయని విమర్శించారు. నాడు మాచర్లలో తనపైనే హత్యాయత్నం జరిగిందని, ఆ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఇప్పటికీ ప్రజలకు గుర్తున్నాయన్నారు. ప్రస్తుతం ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించామని చెప్పారు. పులివెందుల, పుంగనూరులో నామినేషన్ల సమయంలో దాడులు, వాహనాల దహనం వంటి ఘటనలతో భయపెట్టాలని ప్రయత్నించినా ప్రజలు వైసీపీ అరాచకాలకు తగిన సమాధానం ఇచ్చారని వ్యాఖ్యానించారు.

ఈవీఎంలైనా..
బ్యాలెట్ అయినా ప్రజా తీర్పు కూటమికే

2024 ఎన్నికల్లో ఓటమికి ఈవీఎంలను కారణంగా చూపిన వైసీపీ, ఇప్పుడు బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు జరిగినా అదే తరహా ఫలితాలు రావడాన్ని గమనించాలని బోండా ఉమా అన్నారు. 2019లో గెలిచినప్పుడు ఈవీఎంలు మంచివి, 2024లో ఓడినప్పుడు చెడ్డవా? అని వైసీపీని ప్రశ్నించారు. ఈవీఎంలైనా, బ్యాలెట్ పేపర్లయినా ప్రజల తీర్పు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి వైపే ఉందని తాజా ఫలితాలు నిరూపించాయని చెప్పారు. వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

27 నెలల్లో భారీగా సంక్షేమం

కూటమి ప్రభుత్వం గత 27 నెలల్లో పెన్షన్ల కోసమే రూ.75 వేల కోట్లు ఖర్చు చేసిందని బోండా ఉమా తెలిపారు. సామాజిక పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు, దివ్యాంగులకు రూ.6 వేలకు, మంచానికే పరిమితమైన బాధితులకు రూ.10 వేలకు, తలసేమియా రోగులకు రూ.15 వేలకు పెంచి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చెప్పారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ



సౌకర్యం కల్పిస్తున్నామని, 'తల్లికి వందనం' పథకం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఆర్థిక సాయం అందించామని వివరించారు. పేదలకు రూ.5కే భోజనం అందించేందుకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించామని, అన్నదాతలకు రూ.15 వేల కోట్ల పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. మొత్తంగా సంక్షేమ పథకాల కోసం రూ.1.50 లక్షల కోట్లు వెచ్చించామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించామని, బీసీలకు పార్టీపరంగా 40 శాతం వరకు సీట్లు కేటాయించి సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించామని బోండా ఉమా అన్నారు.

పట్టణాభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం

రాష్ట్రంలోని పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం రూ.50వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించి పనులు వేగవంతం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రూ.8,216 కోట్లతో 9,890 కిలోమీటర్ల మురుగు కాల్వల నిర్మాణం, 1,484కిలోమీటర్ల భూగర్భ డ్రైనేజీ పనులు చేపట్టామని చెప్పారు. 502 పట్టణాల్లో వాకింగ్ ట్రాక్‌లు, పార్కులు ఏర్పాటు చేశామని వివరించారు.

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, 20 లక్షల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేశామని బోండా ఉమా పేర్కొన్నారు. మెగా డీఎస్సీ, వార్షిక డీఎస్సీలు, ఎస్సై, కానిస్టేబుల్ నియామకాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ సహకారంతో 36 సాగు, తాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. రెండు తుపాన్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు.

కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు ప్రజలంతా కూటమికి అండగా నిలిచారని, రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తరహా విజయం సాధిస్తామని బోండా ఉమా ధీమా వ్యక్తం చేశారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి మరింత భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని తాజా ఫలితాలు కలిగించాయని ఎమ్మెల్యే బోండా ఉమా పేర్కొన్నారు.

ప్రభుత్వోద్యోగులు కూటమి వెంటే..

- **పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీకి వచ్చిన ఓట్లకంటే రెండింతలు కూటమికి వచ్చాయి**
- **గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టింది..**
- **విడతల వారీగా చెల్లిస్తున్నాం**
- **మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు**



మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు 95 శాతం స్ట్రైక్ రేట్‌తో భారీ విజయాన్ని అందించారని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు అన్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్లలో వైసీపీకి వచ్చిన ఓట్ల కంటే రెండింతలు కూటమికి రావడం ద్వారా ఉద్యోగులు కూటమి ప్రభుత్వంపై విశ్వాసం ప్రకటించారని పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళి కానుకగా ప్రజలు కూటమికి ఈ విజయాన్ని అందించారని, ఇది సాధారణ గెలుపు కాదని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలకుగాను 164 స్థానాల్లో కూటమి విజయం సాధించిన స్ఫూర్తి మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో కనిపించిందన్నారు. సాధారణంగా ప్రభుత్వాలపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉంటుందని, అయితే ఈసారి పోస్టల్ బ్యాలెట్ల ఫలితాలు ఉద్యోగుల మద్దతును స్పష్టం చేస్తున్నాయన్నారు. రెండు తుఫాన్ల ప్రభావం, ఎన్నికల విధులు ఒకేసారి ఎదురైనా రెవెన్యూ, వైద్యారోగ్య, అగ్నిమాపక, మున్సిపల్, పౌరసరఫరాలు, అంగన్వాడీ, విద్యుత్ శాఖల ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. విపత్తు సహాయక చర్యలతో పాటు ఎన్నికల విధుల్లోనూ అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు తెలుగుదేశం పార్టీ, కూటమి తరఫున మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు సుమారు రూ.40 వేల కోట్ల బకాయిలు పెట్టిందని, సీపీఎస్ రద్దు చేయకుండా, రివర్స్ పీఆర్సీ అమలు చేసి, జీపీఎఫ్ నిధులను వినియోగించుకోవడం ద్వారా ఉద్యోగులకు నష్టం కలిగించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు, పెన్షన్లు అందిస్తున్నామని వివరించారు. అలాగే 16 వేలమంది ఉపాధ్యాయులు, 6 వేలమంది పోలీసుల నియామకాలను పూర్తి చేశామని తెలిపారు. ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలు, ఆరోగ్యశ్రీ పరిధిలోని ఈహెచ్ఎస్ చెల్లింపులను సత్వరమే అందిస్తున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా జీతాలు, గ్రాట్యుటీ, సెలవుల వంటి ప్రయోజనాలను సక్రమంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులు గుర్తించారని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. ఉద్యోగ సంఘాలు ప్రభుత్వంతో సుహృద్భావ సంబంధాలను కొనసాగించాలని కోరారు. 12వ పీఆర్సీతో పాటు ఉద్యోగుల మిగిలిన డిమాండ్లను కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తుఫాను సహాయక చర్యలు, ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన ఉద్యోగులందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అశోక్ బాబు పేర్కొన్నారు.

యుద్ధప్రాతిపదికన
విద్యుత్ పునరుద్ధరణ

భారీ వర్షంలోనూ అధికారులు, సిబ్బంది నిర్విరామ కృషి ప్రశంసనీయం

ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి వెల్లడి



భీమవరం (చైతన్య రథం): ఆర్నబ్ తుపాను కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పశ్చిమగోదావరి జిల్లాలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఆర్నబ్ తుపాను కారణంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటికి అప్పగించారు. ఈ నేపథ్యంలో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేసే అంశంపై విద్యుత్ శాఖ అధికారులతో సీఎండీ శివశంకర్ లోతేటి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది సమన్వయంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేశామని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లాలో భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా 33 కేవీ సబ్‌స్టేషన్లు 98, 33 కేవీ ఫీడర్లు 67, విద్యుత్ స్తంభాలు 8,859, 11 కేవీ ఫీడర్లు 475, ట్రాన్స్‌ఫార్మర్లు 516, అలాగే 755 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. దీంతో జిల్లాలోని 6 పట్టణాలు, 20 మండలాల్లోని 409 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారులకు వీలైనంత తక్కువ సమయంలో విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో భారీ వర్షాన్ని, బలమైన గాలులను సైతం లెక్కచేయకుండా అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారని పేర్కొన్నారు. దీంతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవకాశం ఏర్పడిందన్నారు.

బుధవారం సాయంత్రానికి 6 పట్టణాలు, 409 గ్రామాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. జిల్లాలో 17 వేల ఆక్వా సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, వాటిలో 14వేల సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు. మిగిలిన ఆక్వా సర్వీసులతోపాటు వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు కూడా ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో సరఫరాను పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు గత వారం రోజులుగా భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్విరామంగా కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఎక్కడైనా గృహ విద్యుత్ సర్వీసులకు సరఫరా లేనట్లయితే, పునరుద్ధరణ కోసం వినియోగదారులు కంట్రోల్ రూమ్ మొబైల్ నంబరు 9490610152కు కాల్ చేయవచ్చని తెలిపారు. వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

గెలిచిన కూటమి అభ్యర్థులకు వైసీపీ నేతల బెదిరింపులు

- **'రఫా రఫా' అంటూ కూటమి విజేతలపై వైసీపీ నేతల గుండాయిజం**
- **కూటమి విజేతలకు పోలీసులు భద్రత కల్పించాలి**
- **రాష్ట్ర ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు**



విజయవాడ (చైతన్య రథం): ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతూ డిపాజిట్లు గల్లంతు చేసినా, ఆ పార్టీ నాయకుల ఆలోచనా తీరు మారకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ వర్ల రామయ్య విమర్శించారు. తాజా ఎన్నికల ఫలితాల్లో కూటమి అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా విజయం సాధిస్తే, రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు ప్రాంతాల్లో విజేతలను వైసీపీ నాయకులు యాసిడ్ పోస్తామని, ఇళ్లు కూల్చేస్తామని, చంపేస్తామని బెదిరించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ మేరకు వైసీపీ నేతల బెదిరింపులను వివరిస్తూ రాష్ట్రఎన్నికల జాయింట్ కమిషనర్,ఐజీ రాజకుమారికి టీడీపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడంతోపాటు, కూటమి విజేతలకు భద్రత కల్పించాలని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య.. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి బాధ, ఆక్రోశం ఉండటం సహజమేనని, అంతమాత్రాన ప్రజాతీర్పును అపహాస్యం చేస్తూ గెలిచిన వారి ప్రాణాలు తీస్తామని బెదిరించడం ఎంతవరకు సమంజసమని తీవ్రంగా మండిపడ్డారు.

ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చినా కొందరు ఇంకా పాఠాలు నేర్చుకోకపోవడం శోచనీయమన్నారు. ఓడిపోయిన వారు హుందాగా తప్పుకొని, ప్రజాతీర్పును గౌరవించి, వచ్చే ఎన్నికల్లో ప్రజల నమ్మకాన్ని చూరగొనేందుకు రెట్టింపు ఉత్సాహంతో ప్రజాసేవకు పునరంకితం కావాలని సూచించారు. అంతేతప్ప.. "గెలిచినోడిని చంపేస్తాం, పీకలు కోస్తాం, యాసిడ్ పోస్తాం, రఫా రఫా చేస్తాం, మేకపోతుల్లా నరికేస్తాం" అంటూ సైగలు చేస్తూ బహిరంగంగా బెదిరింపులకు దిగడం రాజకీయ యవనికపై సిగ్గుచేటైన చర్య అని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మన్ననలు పొందినవాడే నిజమైన హీరో అని పేర్కొన్నారు. ప్రత్యేకించి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి ఉదయం నుంచి తమ పార్టీ కార్యాలయానికి లెక్కలేనన్ని ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. గెలిచిన పురపాలక ప్రతినిధులను, కార్యకర్తలను తీవ్రస్థాయిలో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యర్థుల వద్ద ఉన్న ధనబలం, ఇలాంటి చౌకబారు దౌర్జన్యాలు ప్రజలు ఇచ్చిన తీర్పు ముందు నిలబడవన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అక్రమంగా పదవుల నుంచి దించేయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. తమ పార్టీ తరఫున వేలాది అభ్యర్థులు గెలుపొందారని, వారందరికీ విడివిడిగా భద్రత కల్పించడం అసాధ్యమని చెప్పారు. అందువల్ల దురాలోచనలతో కుట్రలు పన్నుతున్న ప్రత్యర్థులను అదుపులో ఉంచాలని పోలీస్ కమిషనర్, ఐజీకి స్పష్టంగా వివరించినట్లు తెలిపారు. నేడు కూడా పోలింగ్ ఉండటంతో ప్రజలు, కార్యకర్తలు స్వేచ్ఛగా బయటకు వచ్చేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని,శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరినట్లు చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు,శ్రేణులుఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పూర్తి వ్యవహారాన్ని పోలీసు యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లామని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దౌర్జన్యకారులను చట్టం ముందు నిలబెడతామని పేర్కొన్నారు. భయపడకుండా ప్రజాసేవలో ముందుకు సాగాలని వర్ల రామయ్య పిలుపునిచ్చారు.

ఎన్నికల నిర్వహణలో ఉద్యోగుల సేవలు అభినందనీయం

అనంతరం టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పుర పాలక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి 95శాతం స్ట్రైక్ రేట్‌తో తిరుగులేని విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలందరికీ కూటమి తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. పురపాలక సంఘాల్లో డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తొలుత నవంబరు 9ని నిర్ణయిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. అయితే, దీపావళి పండుగ సందర్భంగా అమావాస్యకు ముందుగానీ, తర్వాతగానీ ఎలాంటి శుభకార్యాలు చేపట్టడానికి మన సంప్రదాయాలు, ప్రజల మనోభావాలు అంగీకరించ వని వివరించారు. ఈ క్రమంలో దాదాపు 15నుంచి 20 మంది మేయర్లు, చైర్మన్లు, అలాగే 50నుంచి 60మంది కార్పొరేటర్లు తమ వద్దకు వచ్చి ప్రమాణస్వీకారాలకు అనుకూలమైన మంచి రోజును చూసి ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. ఇది పార్టీ పరమైన అంశం కాదని, వ్యక్తిగతంగా ఎన్నికల సంఘానికి మెయిల్ ద్వారా విన్నవించుకోవాలని వారికి సూచించామని చెప్పారు.

వారి వినతులను పరిగణనలోకి తీసుకుని ఎన్నికలను ఈనెల 23కి వాయిదా వేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను స్వయంగా కలిసి ధన్యవాదాలు తెలిపామని వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీల ఎన్నికలు కూడా పూర్తి కానుండటంతో రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంస్థల డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల ఎన్నికలు ఒకేసారి నవంబరు 23వ తేదీన శాంతియుతంగా జరగనున్నాయని తెలిపారు. ప్రజాప్రతినిధుల వినతిని, ప్రజల సెంటిమెంట్‌ను గౌరవించి నిర్ణయం తీసుకున్నందుకు ఎన్నికల కమిషన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒకవైపు తుపాను విపత్తు, మరోవైపు పురపాలక ఎన్నికలు..ఈరెండూ ప్రభుత్వ ఉద్యోగులకు రాజ్యాంగ బద్ధమైన కీలక బాధ్యతలని అశోక్ బాబు పేర్కొన్నారు. సాధారణ రోజుల్లో ఏ పనైనా చేయలేమని చెప్పే అవకాశం ఉండొచ్చని, కానీ ఈ రెండింటి విషయంలో ఉద్యోగులు బాధ్యతల నుంచి తప్పుకోవడానికి వీల్లేదన్నారు. ఎంతో ఒత్తిడి ఉన్నప్పటికీ తుపాను సహాయక చర్యల్లోనూ, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడంలోనూ ఉద్యోగులు,ఎన్నికలఅధికారులు అత్యంత సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు. విపత్తు సమయాల్లోనూ,ఎన్నికల విధుల్లోనూ అంకితభావంతో పనిచేసినసిబ్బందిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం మనస్ఫూర్తిగా అభినందించారని తెలిపారు. కూటమి పక్షాన ఉద్యోగులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పర్చూరి అశోక్‌బాబు స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులకు వినతి పత్రం సమర్పించినవారిలో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ తదితరులు ఉన్నారు.

నెమ్మదిస్తున్న వానలు!

- **మురసు తుపాను ప్రభావం తగ్గుముఖం**
- **రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా తగ్గిన వర్షపాతం..**
- **చివరి గంటలో సగటు 0.02 మి.మీ. మాత్రమే**
- **ఉభయ గోదావరి జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు**
- **పర్యవేక్షణలో 12 జలాశయాలు, డ్రెయిన్లు.. థమ్మిలేరులో పెరుగుతున్న ప్రవాహం**
- **నేటి నుంచి వర్షాలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశం**



అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌పై మురసు తుపాను ప్రభావం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సాయంత్రానికి వర్ష తీవ్రత గణనీయంగా తగ్గింది. రాత్రి 7నుంచి 8 గంటల మధ్య రాష్ట్ర సగటు వర్షపాతం కేవలం 0.02 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఏ జిల్లాలోనూ చెప్పుకోదగిన వర్షపాతం నమోదు కాలేదని రాష్ట్ర అత్యవసర స్పందన బృందం వెల్లడించింది. గత రెండు రోజులుగా భారీ వర్షాలతో అతలాకుతలమైన పలు జిల్లాల్లో ప్రస్తుతం పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయి. నవంబరు 3 ఉదయం 8.30 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 137.94 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. కోనసీమలో 126.52 మి.మీ., తూర్పుగోదావరిలో 119.82 మి.మీ., గుంటూరులో 108.97 మి.మీ., ఏలూరులో 105.14 మి.మీ. వర్షపాతం నమోదైంది. 4వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పశ్చిమగోదావరిలో 40.16 మి.మీ., కాకినాడలో 33.85 మి.మీ., ఏలూరులో 23.40 మి.మీ., పోలవరంలో 23.17 మి.మీ., కోనసీమలో 15.69 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. గత రోజుతో పోలిస్తే బుధవారం వర్ష తీవ్రత గణనీయంగా తగ్గినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లో భారీ వర్షాలు

బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నమోదైన వర్షపాత గణాంకాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాలోని కరిచర్లగూడెంలో అత్యధికంగా 230.25మి.మీ. వర్షపాతం నమోదైంది. సాగొండలో 224.25మి.మీ.వర్షం కురిసింది.ఏలూరు జిల్లాలోని జీలుగుమిల్లిలో 220.9మి.మీ., పి.నారాయణపురంలో 220.75 మి.మీ. వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లాలోని పెద్దపూడి ఏఆర్‌జీలో 148.69 మి.మీ. వర్షం కురిసింది. అంతకుముందు నవంబరు 3ఉదయం 8.30గంటల నుంచి 4వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు పల్నాడు జిల్లాలోని ఎడ్లపాడు ఏఆర్‌జీలో 269.45మి.మీ., మర్రిపాలెంలో 263.75 మి.మీ.,పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుమంట్రలో 257.56మి.మీ. వర్షపాతం నమోదైంది.

పట్టణాల్లోనూ భారీ వర్షపాతం

పట్టణ స్థానిక సంస్థల పరిధిలో నవంబరు 3వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి నవంబరు 4వ తేదీ సాయంత్రం 7.30 గంటల వరకు నమోదైన వర్షపాతాన్ని పరిశీలిస్తే తూర్పు గోదావరిజిల్లాలోని నిడదవోలులో అత్యధికంగా 214 మి.మీ. వర్షం కురి సింది. కొవ్వూరులో 171.7 మి.మీ., కాకినాడలో 176.8 మి.మీ., కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరంలో 164.7మి.మీ., అమలాపురంలో 156.4మి.మీ. వర్షపాతం నమోదైంది. చివరి రెండు గంటల వ్యవధిలో పట్టణ స్థానికసంస్థల పరిధిలో నిడదవోలులో 73.6మి.మీ., కొవ్వూరులో 34.1మి.మీ., నరసాపురంలో 32.7 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడించాయి.అయితే చివరిగంటలో ఏ పట్టణ స్థానిక సంస్థ పరిధిలోనూ తీవ్రస్థాయి నీటి ముంపు పరిస్థితులు నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

పర్యవేక్షణలో 12 జలాశయాలు, డ్రెయిన్లు

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 12 జలాశయాలు, డ్రెయిన్లలో నీటిమట్టాలు, ప్రవాహాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి 36,250క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అంతే పరిమాణంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.బుడమేరు వద్ద గేజ్ 4.40అడుగులుగా, బీడీసీ ప్రవాహం 4,174 క్యూసెక్కులుగా నమోదైంది. నల్లమడ డ్రెయిన్‌లో 47,055 క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. ఎర్రకాల్వలో 19,756 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అంతే పరిమాణంలో అవుట్‌ఫ్లో నమోదైంది. గోనెలవాగుకు 4,720క్యూసెక్కుల నీరు చేరుతుండగా, ప్రస్తుతం విడుదల లేదు. పెద్దవాగు నుంచి 11 వేల క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు 1,111 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విడుదల లేదు. కొండవీటివాగు పంప్‌హౌస్ వద్ద నీటిమట్టం +15.20 మీటర్లుగా నమోదైంది. మూడు పంపులు పనిచేస్తుండగా 1,050 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తున్నారు.

మొత్తంగా జలాశయాలు, డ్రెయిన్లలో నీటి ప్రవాహాలు తగ్గుముఖం పట్టడం లేదా స్థిరంగా కొనసాగుతున్నాయి. అయితే థమ్మిలేరు, గోనెలవాగులో నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. నీటి రాకడకు అనుగుణంగా దిగువకు విడుదలలను నియంత్రిస్తున్నారు.

నేటినుంచి మరింత తగ్గనున్న వర్షాలు

యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ (ఈసీఎంఎఫ్) అంచనాల ప్రకారం నవంబరు 5వ తేదీ నుంచి రాష్ట్రంలో అక్కడక్కడ మాత్రమే మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అనంతర రోజుల్లో వర్షపాతం మరింత తగ్గుతుందని అంచనావేసింది. రాబోయే ఐదు రోజుల వర్షపాత అంచనాల ప్రకారం పోలవరం జిల్లాలో అత్యధికంగా 48.85 మి.మీ., తూర్పుగోదావరిలో 44.92 మి.మీ., ఏలూరులో 42.59 మి.మీ., అల్లూరి సీతారామరాజు జిల్లాలో 42.42 మి.మీ., కాకినాడలో 33.86 మి.మీ. సగటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర సగటు వర్షపాతం 23.41 మి.మీ.గా అంచనా వేశారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ లోతట్టుప్రాంతాలు, కాలువలు, డ్రెయిన్లు, జలాశయాల సమీపంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మత్స్యకారులు,ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలు జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రాష్ట్ర ఆర్టీజీఎస్ విభాగం ఆధ్వర్యంలోని అత్యవసర స్పందనబృందం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తోంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చేవరకు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది.

జోన్ - 1
(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)
చైతన్యరథం

ఎమ్మెల్యే అదితిని కలిసిన అవనాపు భార్గవి దంపతులు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ ఘనవిజయం సాధించిన కూటమి అభ్యర్థి అవనాపు భార్గవి, ఆమె భర్త కార్పొరేటర్ అవనాపు విజయ్ బుధవారం ఉదయం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్తానని, వారి సూచనల మేరకు ప్రజల్లో ఉంటూ సేవలు అందిస్తానని భార్గవి చెప్పారు. ఎమ్మెల్యే అదితి పూర్తి సహకారంతో విజయం సాధించానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో విజయనగరం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే దిశగా తన వంతు కృషి చేస్తానని భార్గవి వివరించారు. జనసేన కార్పొరేటర్ అభ్యర్థి గురన రాధిక, అయ్యలు దంపతులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు ఎమ్మెల్యే అదితిని కలిసి ధన్యవాదాలు తెలిపారు.

వర్షంలోనూ ఎన్నికల సిబ్బంది ఇక్కట్లు...



పాయకరావుపేట (చైతన్యరథం): పాయకరావుపేటలో ఉదయం నుంచి వర్షం కురుస్తూనే ఉంది. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ సంబంధించి సిబ్బందికి ఇక్కట్లు తప్పడం లేదు. పాయకరావుపేట మండల కాంప్లెక్స్ ఆవరణలో పోలింగ్ సామగ్రి అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వర్షం కారణంగా టెంట్లు తడిసిపోయాయి. దీంతో మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఆవరణలో ఉన్న భవనాల్లో సామగ్రి పంపిణీ చేపట్టారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో చీకట్లోనే సామగ్రి పంపిణీ చేశారు. వర్షంలో ఎన్నికల సామగ్రిని తరలించేందుకు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

ఎన్నికల విధుల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలి



విజయనగరం(చైతన్యరథం) : జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రాంసుందర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల ఏర్పాట్లను బుధవారం పర్యవేక్షించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లు, పోలింగ్ బృందాలు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరుకున్న తీరు, సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర అంశాలపై ఆరా తీశారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని ముందస్తు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ బృందాలు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, వెబ్ కాస్టింగ్ తదితర మార్గాల ద్వారా పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

అన్ని మండలాల్లో యథావిధిగా ఎన్నికలు



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు జిల్లాలోని అన్ని మండలాల్లో యథావిధిగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ ప్రకటించారు. మురసు తుపాను ప్రభావంతో పెదనందిపాడు, కాకుమాను, ఫిరంగిపురం మండలాల్లో ఎన్నికలు ఒక్కరోజు వాయిదా వేసినట్లు కలెక్టర్ సాయికాంత్ వర్మ తొలుత ప్రకటన చేశారు. అయితే ఎస్ఈసీ ఆదేశాలతో ఆయా మండలాల్లో యథావిధిగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మళ్లీ ప్రకటించారు. తుపానుతో నీరు నిలవడం వలన ఎన్నిక వాయిదా వేయాలని తొలుత నిర్ణయించామని, క్షేత్రస్థాయిలో వాన నీరు తగ్గిపోవడంతో ఎన్నిక నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు ఈ విషయం తెలిసేలా దండోరా వేయించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నవంబర్ 5న జిల్లాలోని 13 మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్ఛాపురం అభివృద్ధికి కృషి చేయాలి!

●నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ ఆశి లీలావతికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచన



కోటబొమ్మాళి (చైతన్యరథం): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలనకు స్థానిక ఎన్నికల ఫలితాలే నిదర్శనమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, అందుకే ప్రజలు కూటమి పాలనపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఆశి లీలావతి మంగళవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇచ్ఛాపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. చైర్‌పర్సన్‌గా లభించిన అవకాశాన్ని పదవిగా కాకుండా ప్రజాసేవకు లభించిన బాధ్యతగా భావించాలని హితవు పలికారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు పదవులు అలంకారప్రాయాలు కావని, ప్రజలకు సేవ చేసే గొప్ప బాధ్యతలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, కూటమి విజయానికి నిస్వార్థంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులందరినీ కలుపుకొని ప్రజాసేవ, పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆశి లీలావతికి సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఆముదాలవలస సిద్ధం



ఆమదాలవలస (చైతన్యరథం): ఆమదాలవలస మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని ఎన్నికల అధికారి డాక్టర్ నారాయణరావు తెలిపారు. ఆమదాలవలస మండలంలో 30 పంచాయతీల్లో 13 ఎంపీటీసీలు ఉన్నాయని, అందులో 53 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో మొత్తం 38,189 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. బూర్జ మండల కేంద్రానికి ఎన్నికల సిబ్బంది చేరుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఆర్. గడ్డెమ్మ తెలిపారు. మండలంలో మొత్తం 58 పోలింగ్ కేంద్రాలకు.. ఒక్కో కేంద్రానికి ఆరుగురు చొప్పున 380 మంది సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం వారికి కేటాయించిన కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తామని పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై ఎం. ప్రవల్లిక తెలిపారు.

కోట సత్తమ్మ అమ్మవారి ఆలయంలోకి భారీగా వరద నీరు



నిడదవోలు (చైతన్యరథం): గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తమ్మ అమ్మవారి ఆలయంలోకి భారీగా నీరు చేరాయి. దీంతో బుధవారం ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ లలిత తెలిపారు. వర్షపు నీటితో పాటు పక్కనే ఉన్న మురుగు కాలువ నుంచి కూడా నీరు పొంగిపొర్లుతుండడంతో ఆలయ ఆవరణలోకి నీరు చేరింది. ఆలయ ఆవరణ నుంచి నీరును బయటకు పంపేందుకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.

కుండపోత వర్షానికి మన్యం ప్రాంతం అతలాకుతలం

బుట్టాయగూడెం (చైతన్యరథం): తుపాను ప్రభావంతో మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షానికి ఏలూరు జిల్లా మన్యం ప్రాంతం అతలాకుతలమైంది. బుట్టాయగూడెం మండలంలో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. అలివేరు వద్ద ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలోకి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతుంది. జలాశయం నీటిమట్టం 217.80 మీటర్ల సామర్థ్యానికి గాననూ బుధవారం ఉదయానికి 216.60 మీటర్లకు చేరుకున్నట్లు జలవనరుల శాఖ ఏఈఈ సురేశ్ తెలిపారు. బుట్టాయగూడెం– కేఆర్ పురం మార్గంలో కన్నాపురం తూర్పు కాలువ రహదారిపై నుంచి పొంగి ప్రవహిస్తుంది. వేరుమద్దిగూడెం వద్ద కోడే కాలువ వాగు పొంగడం రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయం వద్ద సిబ్బందికి సామగ్రి పంపిణీకి తీవ్ర అవస్థలు పడ్డారు.

ఆ గ్రామాన్ని ముంచెత్తిన అర్నబ్, మురసు తుపాను వరద

జెడ్ రాగంపేట (చైతన్యరథం): అర్నబ్ తుపాను సృష్టించిన ముప్పు నుంచి తేరుకోకముందే మురసు తుపాను బీభత్సం సృష్టిస్తోంది. అర్నబ్ నుంచి లోతట్టు ప్రాంతాలు నేటికీ ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. గండేపల్లి మండలం జెడ్. రాగంపేట గ్రామంలో బావి చెట్టు చెరువు నుంచి వచ్చే నీరు గ్రామాన్ని ముంచెత్తింది. ఈ ప్రభావంతో ఇల్లు నీట మునగగా, కాలువ పొంగి ప్రవహిస్తుంది. దీంతో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందుల చిట్టిబాబు ఘటన స్థలానికి చేరుకునీ క్రేన్, మిషన్లతో కాలువ ఖాళీ చేయించి నీరు ముందుకు పోయే విధంగా శుభ్రం చేయించారు. అనంతరం గ్రామస్థులకు అల్పాహారం, ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అల్పాహారం భోజనం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు గరిష్ఠంగా సహాయం అందిస్తాం

●రెండు తుఫాన్లతో వరి, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం

●పంటల బీమాపై రైతులు అవగాహన పెంచుకోవాలి.. శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలి

●కొల్లిపర మండలంలోని తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన పెమ్మసాని



గుంటూరు (చైతన్యరథం): రెండు తుఫాన్ల కారణంగా పంట నష్టపోయిన రైతులకు గరిష్ఠ స్థాయిలో సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గతంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందడంతో ఈ ఏడాది రైతులు ఎకరానికి దాదాపు 50 బస్తాల వరకు దిగుబడి సాధించారని పేర్కొన్నారు. ఆర్నబ్, మురస్ తుఫాన్ల ప్రభావిత ప్రాంతాలలో గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కొల్లిపర మండలంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి బుధవారం పర్యటించారు. నీట మునిగిన పొలాల పరిశీలనలో భాగంగా పలువురు రైతులతో పెమ్మసాని మాట్లాడారు. పంట నష్ట పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ... ధాన్యానికి మంచి ధర లభించి, రైతులు సంతోషంగా ఉన్న సమయంలో ఈ రెండు తుఫాన్ల కారణంగా వరి, మినుము, పత్తి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ అండ

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం ఇప్పటికే రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తోందని, దీనికి అదనంగా ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించనున్నట్లు మంత్రి తెలిపారు. పంట నష్టంపై పూర్తిస్థాయి అంచనా వేసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని ప్రకటిస్తారని చెప్పారు.

48 - 72 గంటల్లో పంట నష్టం ఎన్యూమరేషన్ పూర్తి చేయాలి

పంట నష్టంపై స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ రాజాతో కలిసి జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు మంత్రి తెలిపారు. ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉన్నప్పటికీ, పంట నష్టం ఎన్యూమరేషన్‌లో ఏ ఒక్క రైతును కూడా మిస్ కాకుండా చూడాలని సూచించినట్లు చెప్పారు. రాబోయే 48 నుంచి 72 గంటల్లో ఎన్యూమరేషన్ పూర్తి చేసి, నష్టపోయిన రైతుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలి

ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో కౌలు రైతులు వ్యవసాయం చేస్తున్నారని, అన్నదాత సుఖీభవ పథకం కింద అందించే రూ. 20వేల సాయం ఎక్కువగా భూమి యజమానుల ఖాతాల్లోకి వెళ్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందించనున్న ఇన్‌పుట్ సబ్సిడీని కనీసం మానవతా దృక్పథంతో కౌలు రైతులకు అందించేలా భూమి యజమానులు పెద్ద మనసుతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పంటల బీమాపై రైతులు అవగాహన పెంచుకోవాలి

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో గత ఆరు నెలలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో పలుమార్లు సమీక్షలు నిర్వహించి, రైతులందరూ పంటల బీమా చేయించుకునేలా అవగాహన కల్పించినట్లు మంత్రి తెలిపారు.

మున్సిపల్ ఎన్నికల విజయ స్ఫూర్తితో పరిషత్ ఎన్నికల్లోనూ ఘన విజయం సాధించాలి

● రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ఆకాంక్ష



కాకినాడ (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి లభించిన సానుకూల ఫలితాల నేపథ్యంలో, నేడు జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో అంతకుమించిన విజయాన్ని సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు విస్తృతంగా చర్చించారు. కొప్పవరంలోని తన కార్యాలయంలో బుధవారం కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్, కాకినాడ జిల్లా ఎన్నికల సమన్వయకర్త, మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావుతో సమావేశమైన ఎంపీ సానా సతీష్‌బాబు, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, నేడు జరగనున్న పరిషత్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి లభించిన ప్రజా మద్దతును పరిషత్ ఎన్నికల్లోనూ ప్రతి భింబించేలా క్షేత్రస్థాయిలో పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా చర్చించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించడం, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పరిషత్ ఎన్నికల్లో మరింత ఘన విజయం సాధించేలా కృషి చేయాలని ఎంపీ సానా సతీష్ బాబు ఆకాంక్షించారు.

మురసా ప్రభావం.. జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాను

●నియోజకవర్గంలో తుఫాను ప్రభావిత ప్రాంతాలు, నీటమునిగిన పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి గొట్టిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): మురసా ప్రభావంతో నియోజకవర్గంలో ఎక్కువ నష్టం జరిగిందని, ముఖ్యంగా రైతాంగానికి పూడ్చలేని విధంగా భారీ నష్టం వాటిల్లిందని, పత్తి, మిరప, వాణిజ్యపంటలు నీళ్లలో తేలుతున్న దృశ్యాలు చూస్తుంటే బాధ కలిగిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం ప్రత్తిపాటి, పల్నాడు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, విద్యుత్ శాఖా మాత్యులు గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి చిలకలూరిపేట నియోజకవర్గంలో మురసా తుపాన్ ధాటికి నీటమునిగిన ప్రాంతాలు, పొలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి, మంత్రి పలుచోట్ల ప్రజలు, రైతులతో మాట్లాడి, వారికి జరిగిన నష్టాన్ని తెలుసుకున్నారు. తుపాను బాధితుల నిర్వాసిత కేంద్రాలకు వెళ్లి, వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు.

విద్యుత్ శాఖకు రూ.600 కోట్లవరకు నష్టం : మంత్రి గొట్టిపాటి

అ ర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే రాష్ట్రంపై మురసా విరుచుకుపడిందని, ఒంగోలు సమీపంలో తీరందాటాక, చిలకలూరిపేటపై ఎక్కువ ప్రభావం పడిందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అర్నబ్ తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ వరకు విద్యుత్ వ్యవస్థ బాగా దెబ్బతిందన్నారు. ఇంతటి విపత్కర పరిస్థుతుల్లోనూ విద్యుత్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని గొట్టిపాటి చెప్పారు. అర్నబ్, మురసా ప్రభావంతో రాష్ట్రంలో 10వేలకు పైగా కరెంట్ స్తంభాలు నేలకొరిగాయని, వందల కిలోమీటర్ల మేర లైన్లు దెబ్బతిన్నాయని మంత్రి తెలిపారు. తుఫాన్ల నష్టంతో రాష్ట్ర విద్యుత్ శాఖకు రూ. 500 నుంచి 600 కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు.

జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతాను : ప్రత్తిపాటి

మురసా తుపాను ప్రభావంతో గత 30 ఏళ్లలో ఎన్నడూ జరగనంత నష్టం నియోజకవర్గంలో జరిగిందని, తీరం దాటాక నాలుగ్గంటలపాటు చిలకలూరిపేటపై కుంభవృష్టి కురిసిందని, నా రాజకీయ జీవితంలో ఇంత తీవ్రనష్టాన్ని చూడలేదని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోనే 600కు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, రైతాంగానికి పూడ్చలేని నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. నియోజకవర్గవ్యాప్తంగా పత్తి, మిరప, ఉద్యానపంటలు నీటమునిగాయన్నారు. తుపాను తీవ్రతను గమనించి ప్రభుత్వం, యంత్రాంగం ముందే ప్రజల్ని హెచ్చరించిందని, దాంతో చాలావరకు ప్రాణ నష్టం తగ్గిందన్నారు. నియోజకవర్గంలో ఇద్దరు మరణించారని ప్రభుత్వపరంగా వారి కుటుంబాలను ఆదుకుంటామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. పట్టణంలో పలువార్డులు నీటమునిగాయని, వెంటనే ప్రజల్ని నిర్వాసిత కేంద్రాలకు తరలించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, సమర్థ పనితీరువల్లే రాష్ట్రంలో మురసా ప్రభావ నష్టాన్ని తగ్గించగలిగారని ప్రత్తిపాటి తెలిపారు. నియోజకవర్గానికి భవిష్యత్ లో వరద ముప్పు లేకుండా ఉండాలంటే వెంటనే, ప్రధాన వాగులైన కుప్పగంజి, ఓగేరు, నక్క వాగుల్ని ఆధునీకరించాలని ప్రత్తిపాటి తెలిపారు. ప్రవాహానికి అడ్డుగా ఉన్న కంపచెట్లు, పూడికను తొలగించి, మూడు వాగుల్ని విస్తరిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. వాగుల సమస్యను ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇన్ చార్జ్ మంత్రి గొట్టిపాటికి తెలియచేసినట్లు ఆయన చెప్పారు.

విజయవాడ అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది

●ప్రజలు అందించిన ఘన విజయం మరింత బాధ్యతను పెంచింది : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమికి ప్రజలు ఘన విజయాన్ని అందించడంతో విజయవాడలో కూటమి శ్రేణుల్లో సంబరాలు అంబరాన్నంటాయి. విజయవాడ మేయర్‌గా ఎన్నికైన వంగవీటి రాధాకృష్ణకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు టీడీపీ సీనియర్ నాయకుడు బుద్ధా వెంకన్న, గద్దె అనురాధ తదితరులు పాల్గొని నూతన మేయర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... విజయవాడ నగర ప్రజలు మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణకు పట్టం కట్టారని, కూటమిపై తమకున్న విశ్వాసాన్ని ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టంగా చాటిచెప్పారని అన్నారు. మొత్తం 86 డివిజన్లలో ఎనిమిది మినహా మిగిలిన అన్ని డివిజన్లలో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ప్రజలు అందించిన తిరుగులేని తీర్పుకు నిదర్శనమన్నారు. 76 డివిజన్లలో విజయం సాధిస్తామని అంచనా వేయగా, 78 డివిజన్లలో కూటమి అభ్యర్థులు గెలుపొందడం విశేషమని పేర్కొన్నారు. ఓటింగ్ శాతం తక్కువగా నమోదైనప్పటికీ ప్రజలు కూటమికి ఇంతటి ఘన విజయాన్ని అందించారని, ఓటింగ్ శాతం మరింత పెరిగి ఉంటే రెండు లక్షల మెజారిటీని కూడా దాటేవారమని అభిప్రాయపడ్డారు.

విజయవాడ నూతన మేయర్ వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ...

తనకు మేయర్‌గా అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు, తనను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విజయవాడ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ముందడుగు

ఎన్నికల్లో ప్రజలు అందించిన ఘన విజయాన్ని బాధ్యతగా భావిస్తూ, విజయవాడ నగర అభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యేలు, మేయర్, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కూటమి నేతలు ఆకాంక్షించారు. నగర ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ విజయవాడను అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాతీర్పును జీర్ణించుకోలేక జగన్ అర్థరహిత ఆరోపణలు: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు (చైతన్యరథం): రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం, ఎన్నికల హామీల అమలు వంటి అంశాలతో చెప్పాం.. చేస్తున్నాం నినాదంతో మీ ముందుకు వచ్చిన కూటమి అభ్యర్థులకు మద్దతు పలికి బ్యాలెట్ పేపర్ ఓటింగ్‌తో విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతిపక్షానికి పోటీలో నిలిచే అవకాశం కూడా లేకుండా చేసి, ఎన్నికల్లో ఎలా ఘన విజయం సాధించవచ్చో నిరూపించారంటూ పోలీస్ శాఖ, ఎన్నికల కమిషన్ ప్రభుత్వాల మీద జగన్‌రెడ్డి ఆరోపణలు వ్యంగ్యానికి కారణం జగన్మోహన్‌రెడ్డి మీద ఉన్న ఆగ్రహాన్ని ప్రజలు మరోసారి చూపడమే! ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోనూ అక్రమాలు జరిగాయని వైసీపీ చేసే ఆరోపణలు సిగ్గుచేటు. నేను గెలిస్తే ప్రజాస్వామ్యం లేకుంటే అప్రజాస్వామికం అనే జగన్ రెడ్డి వాదన సిగ్గుచేటు. నిన్నటి వరకు ఈవిఎంల అవకతవకలంటూ ఆరోపణలు చేస్తున్న వైసీపీకి ప్రజలు బ్యాలెట్ పేపర్ ద్వారా "వైసీపీ మాకొద్దు బాబోయ్" అంటూ ప్రజాభిప్రాయాన్ని కూటమికి మద్దతును తెలిపిన తీరు చూసి చిప్ కోల్పోయి అసహనంతో అడ్డడిద్దంగా ఆరోపణలు ప్రారంభించారు. 2021లో నిర్వహించినవి ఎన్నికలు కాదు ఎంపికలు అని ప్రజలందరికీ తెలుసు అని ఎన్నిక ఏదైనా కూటమిదే విజయమని, ఇకనైనా తన వక్రబుద్ధిని మార్చుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సూచించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

●నగర పాలక సంస్థ ఎన్నికల్లో గెలిచిన ఎన్డీయే అభ్యర్థులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి దిశానిర్దేశం



గుంటూరు (చైతన్యరథం): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. బుధవారం గుంటూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎన్డీయే కూటమి అభ్యర్థులు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకొని, తమ గెలుపునకు అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజేతలందరినీ ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు శుభాకాంక్షలు అందజేశారు. కూటమి అభ్యర్థులపై అపారమైన నమ్మకంతో గెలిపించిన నగర ప్రజలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధన్యవాదాలు తెలుపుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ డివిజన్లలోని సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధికి నిరంతరం అంకితభావంతో పనిచేయాలని కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేశారు. అలాగే కూటమి భాగస్వామ్య పక్షాలు పరస్పర సమన్వయంతో, ఐక్యంగా పనిచేస్తూ ప్రజా సంక్షేమ పాలనను ప్రతి ఇంటికీ చేర్చాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి : యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి నేడు జరుగనున్న స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలోని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమ కేసులతోనూ, భూ కబ్జాలతో ఎన్నో ఇబ్బందులకు గురైన గన్నవరం నియోజకవర్గ ప్రజలు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 35 వేల పై చిలుకు ఓట్ల మెజార్టీతో తనకు అఖండ విజయం చేకూర్చారని అదే రీతిగా రేపు జరగబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలో గడిచిన 29 నెలల కాలంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. ప్రసాదంపాడు శక్తి కళ్యాణ మండపం రోడ్డు, గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ ఆగిరిపల్లి రోడ్డు, గన్నవరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి పనులను ఉదాహరణగా పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువల మరమ్మతు పనులు సకాలంలో చేపట్టి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చేశామని తెలిపారు.

పదవిని బాధ్యతగా భావించండి : ఎమ్మెల్యే నసీర్

● ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

●ఓటర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోండి



గుంటూరు (చైతన్యరథం): నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందిస్తూ నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. బుధవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ను నూతనంగా ఎన్నికైన నియోజకవర్గ కార్పొరేటర్లు వచ్చి కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి కార్పొరేటర్లను గెలిపించారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేయాలని సూచించారు. ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ కలిసికట్టుగా అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికే తూర్పు నియోజకవర్గంలో 400 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్పొరేటర్లు ముందంజలో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురయ్యే ప్రతి సమస్యనూ ప్రభుత్వాధికారులు దృష్టికిగానీ, మా దృష్టికిగానీ వెంటనే తీసుకురావాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందేలా చూడాల్సిన బాధ్యత కార్పొరేటర్లదేనని స్పష్టం చేశారు . పదవి అనేది బాధ్యత మాత్రమేనని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అన్నారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎమ్మెల్యే నసీర్ సారథ్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

వినుకొండ ప్రజలు కూటమికి అండగా నిలిచారు... ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): వినుకొండ పురపాలక సంఘ ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలిచి కూటమికి మంచి విజయాన్ని అందించారని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లుగా కూటమి అభ్యర్థులను గెలిపించిన పట్టణ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. వినుకొండ కొండ ఘాట్ రోడ్డు, శాశ్వత తాగునీటి పథకాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్, పార్కు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గం మంచి మెజారిటీతో ప్రజల మద్దతు పొందిందని, పట్టణానికి మెరుగైన పాలన అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై గౌరవం ఉందని చెప్పుకునే జగన్ ఓటు వేయకుండా ఎలా ఉంటారని ప్రశ్నించారు. వినుకొండలోని 36 వార్డుల్లో ఎనిమిది స్థానాల్లో వైసీపీ, ఒక స్థానంలో సీపీఐ అభ్యర్థులు ఎలా గెలిచారని ప్రశ్నించిన జీవీ.. కూటమి రిగ్గింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. రిగ్గింగ్ జరిగితే ప్రతిపక్ష అభ్యర్థులు ఎలా విజయం సాధించారని నిలదీశారు. ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు పక్క గ్రామాల నుంచి రౌడీలను, దొంగ ఓటర్లను తీసుకొచ్చారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య విజయమని, అభివృద్ధి, సంక్షేమం గెలుపు అని జీవీ వ్యాఖ్యానించారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: మున్సిపల్ చైర్మన్ షమీమ్ ఖాన్

వినుకొండ మున్సిపల్ చైర్మన్‌గా భారీ మెజారిటీతో తనను గెలిపించిన పట్టణ ప్రజలకు చేరుకుంపాలెం షమీమ్ ఖాన్ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. జీవీ ఆంజనేయులు మార్గదర్శకత్వంలో, ఆయన విజన్‌కు అనుగుణంగా వినుకొండ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: వైస్ చైర్మన్ పెనుగొండ శ్రీనివాసరావు

ఎనిమిదో వార్డులో తనను మంచి మెజారిటీతో గెలిపించడంతో పాటు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు మద్దతు తెలిపిన పట్టణ ప్రజలకు పెనుగొండ శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా పని చేస్తానని పేర్కొన్నారు.

నందిగామ మున్సిపల్ పీఠంపై కూటమి జెండా... అంబరాన్నంటిన విజయోత్సవ సంబరాలు!

●ప్రజల తీర్పుతో ప్రతిపక్షానికి గట్టి గుణపాఠం.... రూ.150 కోట్ల అభివృద్ధికి పునాదులు : ఎమ్మెల్యే తంగిరాల

నందిగామ (చైతన్యరథం): నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవడంతో పట్టణంలో విజయోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణాసంచా కాల్చి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త విజయవాడ దుర్గగుడి డైరెక్టర్ తంబళ్లపల్లి రమాదేవి, మున్సిపల్ చైర్మన్ శాకమూరు వంశీధర్, కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. అనంతరం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే తంగిరాల మాట్లాడుతూ... నందిగామ పట్టణ ప్రజలు కూటమిపై ఉంచిన విశ్వాసం, అందించిన చారిత్రాత్మక విజయానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

గొడ్డలి పార్టీకి ప్రజలే గుణపాఠం చెప్పారు!

ప్రస్తుతం అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కానీ గొడ్డలి పార్టీ ప్రభుత్వం కాదని, అయినప్పటికీ తామే ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమలో ప్రతిపక్ష నేతలు బతుకుతున్నారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను బెదిరించడం, తిరిగి అధికారంలోకి వస్తే కేసులు పెడతామంటూ హెచ్చరించడం వంటి నీచ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి హేయమన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తిగత దాడులు, అక్రమ కేసులు, అన్యాయాలతో తమను ఇబ్బందులకు గురిచేసిన వారికి నందిగామ ప్రజలు ఓటు రూపంలో తగిన గుణపాఠం చెప్పారని స్పష్టం చేశారు.



రెండు ఓట్లు.. రూ.150 కోట్ల అభివృద్ధికి మెట్లు!

నందిగామ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు వేసిన రెండు ఓట్లు కేవలం అభ్యర్థుల గెలుపునకు మాత్రమే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో పట్టణంలో చేపట్టబోయే సుమారు రూ.150 కోట్ల అభివృద్ధి పనులకు అవి పునాదులని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం : ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు వారి కార్యాలయం నందు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగించిన సందర్భంగా గెలుపొందిన కార్పొరేటర్‌లను ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశంపార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులకు అద్భుతమైన విజయాన్ని అందించి తమ ఆశీర్వాదాలను అందించారు. ఈ విజయం మా బాధ్యతను మరింత పెంచింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత 27 నెలలుగా రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం నిరంతరం చేస్తున్న కృషికి ప్రజలు తమ తీర్పు ద్వారా మద్దతు పలికారు. ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాబోయే రోజుల్లో మరింత బాధ్యతతో పనిచేస్తాం. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 29 కార్పొరేటర్ స్థానాలకు గాను 28 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం చారిత్రాత్మకం. 100 శాతం విజయమే లక్ష్యంగా ముందుకు సాగిన మా ప్రయాణంలో ప్రజలు అందించిన ఈ భారీ విజయం మాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది, ఈ చారిత్రాత్మక విజయాన్ని భవిష్యత్తులోనూ నిలబెట్టుకుంటూ విజయవాడ సెంట్రల్‌ను మరింత అభివృద్ధి చేస్తాం. యువతకు రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచన. అందులో భాగంగానే కూటమిలో యువతకు ప్రాధాన్యత కల్పిస్తున్నాం. జనసేన పార్టీ తరఫున వంగవీటి రాధాకృష్ణ వంటి అనుభవం కలిగిన యువ నాయకులకు అవకాశం కల్పించడం సంతోషకరం. యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి భాగస్వామ్యంతో విజయవాడను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. . ఈ అద్భుతమైన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తాం

●మంత్రి నారాయణకు స్వాగతం పలికిన మంత్రి సవితమ్మ

●మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు అభినందనలు తెలిపిన మంత్రి నారాయణ



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించిన నేపథ్యంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ బుధవారం పెనుకొండలోని మంత్రి సవితమ్మ క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడుతో పాటు కౌన్సిలర్లను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రతి వార్డులోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సవితమ్మతో కలిసి రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, ఎన్నికల కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, ఎన్నికల పరిశీలకులు సోమశెట్టి వెంకటేశ్వర్లు, పెనుకొండ మున్సిపల్ చైర్మన్ త్రివేంద్ర నాయుడు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత తీసుకున్నాడు.. భుజస్కంధాలపై మోశాడు

●40 ఏళ్లుగా గెలవని చోట టీడీపీ జెండా ఎగురవేశాడు



నెల్లూరు (చైతన్యరథం): నాలుగు దశాబ్దాలుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకి గెలుపు దక్కని జెండా వీధి, ముస్లిం ప్రాంతాల్లో విజయపతాకం ఎగురవేసి, తన నాయకత్వ సత్తా చాటారు ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ అజీజ్. పురపాలక శాఖ మంత్రివర్యులు, నెల్లూరు నగర శాసనసభ్యులు పొంగూరు నారాయణ తనకు అప్పగించిన ఏడు డివిజన్ల గెలుపు బాధ్యతను భుజస్కంధాలపై మోసి, ఏడింటినీ విజయతీరాలకు చేర్చారు. పాత రాజకీయ సమీకరణాలను తిరగరాస్తూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు. బాధ్యత తీసుకున్న నాటి నుంచి గెలుపే లక్ష్యంగా అజీజ్ ముందుకు సాగారు. అనేక వ్యూహాలు రచించడంతోపాటు, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేశారు. ముఖ్యమైన వైసీపీ నాయకులను టీడీపీ గూటికి చేర్చారు. అన్ని డివిజన్లలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఓటర్లను నేరుగా కలుస్తూ టీడీపీకి మద్దతు కోరారు. నాయకులు, కార్యకర్తలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చి ప్రచారాన్ని ముందుండి నడిపించారు..

40 ఏళ్లుగా గెలుపు దక్కని చోట టీడీపీని గెలిపించి చూపించారు

గతంలో కాంగ్రెస్‌కు, ఆ తర్వాత వైఎస్సార్సీపీకి మద్దతుగా నిలిచిన ముస్లిం ఓటర్లలో టీడీపీకి ఆదరణ కూడగట్టడంలో అజీజ్ కీలకపాత్ర పోషించారు. 2024 ఎన్నికల్లో కొన్ని చోట్ల వైఎస్సార్సీపీ వైపు నిలిచిన ఓటర్ల మద్దతును టీడీపీ వైపు మళ్లించారు. ఈ ప్రయత్నాలతో 40 ఏళ్లుగా గెలుపు దక్కని చోట టీడీపీని గెలిపించి చూపించారు. నెల్లూరు నగరంతోపాటు రూరల్ నియోజకవర్గంలోనూ అజీజ్ విస్తృతంగా పర్యటించారు. ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. తానే కాకుండా తన సోదరుడు అబ్దుల్ జలీల్ సైతం క్షేత్ర స్థాయిలో పర్యటించి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనకు బాధ్యత అప్పగించిన డివిజన్లకే పరిమితం కాకుండా సాధ్యమైనన్ని డివిజన్లు అన్నిటిలో ప్రచారం నిర్వహించారు.

ప్రజల మద్దతుతో విజయాన్ని సాధించిన అజీజ్

ఒకవైపు వ్యూహాలు రచిస్తూ, మరోవైపు క్షేత్రస్థాయిలో పనిచేస్తూ తనకు అప్పగించిన డివిజన్ల బాధ్యతను చివరి వరకు మోశారు. టీడీపీ విజయపతాకం ఎగురవేశారు. ఈ ఫలితాలు అజీజ్ నాయకత్వానికి, నిదర్శనంగా నిలిచాయి. పదవికి వన్నె తెచ్చేది నాయకుడి పనితీరే. కార్యకర్తలతో భుజం కలిపి, ప్రజల మద్దతుతో విజయాన్ని సాధించిన అజీజ్ అందుకు ఉదాహరణగా నిలిచారు. వ్యూహంలో నేర్పు... క్షేత్రస్థాయిలో చొరవ... అందరినీ ముందుకు నడిపించడంలో నాయకత్వం... ఈ మూడింటితో విజయానికి బాటలు వేశారు. తనపై ఉంచిన నమ్మకానికి ఏడు విజయాలతో సమాధానం ఇచ్చారు అబ్దుల్ అజీజ్!

వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

● చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే దుగ్గుపాటి



కమలానగర్ (చైతన్యరథం): అనంతపురం నగరంలో మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ గెలుపు తర్వాత ఆ పార్టీ నాయకులు చేసిన దాడులకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే స్వయంగా పరామర్శించి ధైర్యం చెప్పారు. 3వ డివిజన్ అభ్యర్థి రాధను మహిళ అని కూడా చూడకుండా 35 మంది కలిసి ఇష్టానుసారంగా కొట్టారని, అలాగే 29వ డివిజన్ అభ్యర్థి జగదీష్ ఇంట్లోకి చొరబడి మహిళలపై దాడికి తెగబడ్డారన్నారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ఎలాంటి అరాచకాలు చేసిందో ప్రజలందరూ చూశారని, ఎన్నికల్లో గెలిచిన అహంకారంతో ఇప్పుడు మళ్లీ పాత పద్ధతుల్లోనే దౌర్జన్యాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు. నిన్న సాయంత్రం కూటమి నాయకులే లక్ష్యంగా దౌర్జన్యాలు జరిగాయని మండిపడ్డారు. తమ నాయకుడు సీఎం చంద్రబాబు ఎల్లప్పుడూ శాంతియుత మార్గాన్ని, ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారని.. ఈ ఘటనలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థిని లక్ష్మీకి పరామర్శ

రాప్తాడు పాఠశాల ఘటనలో గాయపడి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని లక్ష్మీని ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పరామర్శించారు. లక్ష్మీ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని, మరో రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి అయ్యే అవకాశం ఉందని మీడియాకు వెల్లడించారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా స్నేహితురాలిని కాపాడేందుకు లక్ష్మి ప్రదర్శించిన అసాధారణ ధైర్యసాహసాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో బెంగళూరులో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న మరో బాలిక ఆరోగ్యం కూడా మెరుగవుతోందని, మంత్రి నారా లోకేశ్ స్వయంగా చొరవ తీసుకుని ఆ బాలిక వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని స్పష్టం చేశారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఓటర్ స్లిప్పులు పంపిణీలో జాప్యం

యర్రగొండపాలెం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలంలో గురువారం జడ్పీటీసీ అభ్యర్థుల ఎన్నిక పోలింగ్ జరగనుంది. నిబంధనల ప్రకారం ఓటర్లకు స్థానిక బీఎల్వోలు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయాలి. అయితే, యర్రగొండపాలెం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయలేదు. దీంతో పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓటరు స్లిప్ ల కోసం జాబితాలో వెతుక్కుంటూ కనిపించారు. బుధవారం ఉదయం నుంచి వందల మంది ఇలా తమ ఓటు స్లిప్పుల కోసం తంటాలు పడుతున్నారు. చదువుకోని వృద్ధులు ఎవరిని అడగాలో అర్థం కాక కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. కీలకమైన ఈ పంపిణీ కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై జనాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై యర్రగొండపాలెం ఎన్నికల అధికారి బాలునాయక్ను వివరణ కోరగా, ఓటర్లకు కచ్చితంగా స్లిప్పుల పంపిణీ చేయాలని దీనిపై అధికారులకు తగిన ఆదేశాలు ఇస్తానని పేర్కొన్నారు. కాగా కొందరు బీఎల్వోలకు ఎన్నికల విధులు కేటాయించడంతో వారి పరిధిలోని ఓటర్లకు స్లిప్పులు పంపిణీ చేయలేదు.

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి... అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలి

●నూతన కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్సీ వై.వీ.బీ.రాజేంద్ర ప్రసాద్ దిశానిర్దేశం



ఉయ్యూరు (చైతన్యరథం): మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు బుధవారం ఎమ్మెల్సీ వై.వీ.బీ. రాజేంద్ర ప్రసాద్‌ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో తమ విజయానికి సహకరించి, కృషి చేసిన రాజేంద్ర ప్రసాద్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ నూతన కౌన్సిలర్లను అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతను గుర్తించి, వార్డుల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. "ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకమే మనకు బలం. పదవి కోసం కాకుండా ప్రజల కోసం పనిచేయాలి. ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి. ఉయ్యూరు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దాం" అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కౌన్సిలర్లు చొరవ చూపాలని ఆయన కోరారు. నూతన కౌన్సిలర్లకు మరోసారి శుభాకాంక్షలు తెలిపి, ప్రజాసేవలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నూతన కౌన్సిలర్లు బోర్ర సుబ్బారావు, పలియాల శ్రీనివాసరావు, రాజుల పార్టీ ఫణికుమార్, జంపాన చినబాబు, టిడిపి నాయకులు సయ్యద్ అజ్మతుల్లా, రాజుల పార్టీ ఫణి కుమార్, మురారి అయ్యా, జంపాన శివయ్య,, జంపానా నరసింహారావు, తేజ, చిన్ని, శంకర్, నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి ఓటేస్తే మురిగిపోయినట్లే : ఎమ్మెల్యే కందుల



మార్కాపురం (చైతన్యరథం): వైసీపీకి ఓటేస్తే మురిగిపోయినట్లేనని, ప్రజలకు సంక్షేమాభివృద్ధి అందించే ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడేనని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. గత మంగళవారం మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు, చింతగుంట్ల, వేములకోట, పెద్ద యాచవరం, రాయవరం గ్రామాలలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైసీపీకి ఓటేస్తే... మురిగిపోయినట్లేనని వారిని గెలిపిస్తే కనీస మౌళిక వసతులు కూడా అందే పరిస్థితి లేదన్నారు. ఏ వర్గానికి వైసీపీ నాయకులు న్యాయం చేయలేరని, నేడు జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. మార్కాపురం జిల్లా ప్రకటనతో ఈ ప్రాంతంలో రైతుల భూములు కొన్ని రెట్లు పెరిగాయని, వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి నీటిని కూడా విడుదల చేశామని, త్వరలో కాలువలు తీసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. మార్కాపురంలో హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని, రైతులకు అధిక ఆదాయం కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

మాజీ చైర్మన్ ఏ. చక్రపాణికి ఎమ్మెల్సీ బీద నివాళి

నెల్లూరు (చైతన్యరథం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఏ. చక్రపాణి మరణం పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన అనంతరం తొలి చైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేసుకున్నారు. పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల అపారమైన గౌరవం కలిగిన చక్రపాణి చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు. డాక్టర్ చక్రపాణి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ, ముఖ్యమంత్రి గారు తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

కోట్లలో ఓట్లు... గంటల్లో ఫలితాలు

◆ వేగంగా లెక్కింపు ఎలా సాధ్యం ◆ అమెరికాలో కౌంటింగ్ విధానంపై విశ్లేషణ



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో దాదాపు 15 కోట్ల మందికి పైగానే ఓటు వేశారు. ఓట్లు వేసింది పేపర్ బ్యాలెట్‌ల పైనే అయినా అతి తక్కువ సమయంలో అన్ని ఓట్లను ఎలా లెక్కిస్తారనే సందేహం రావచ్చు. భారత్‌లో అయితే ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు)ను వినియోగించడంతో ఓట్ల లెక్కింపు ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ఫలితాలు వెలువడుతాయి. అమెరికాలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అక్కడ ఓటర్లు కాగితపు బ్యాలెట్ పత్రాలపైనే ఓటు వేస్తారు. అయినప్పటికీ కోట్లాది ఓట్ల లెక్కింపు వేగంగా జరుగుతుంది. అసలు అమెరికాలో ఓట్లను ఎలా లెక్కిస్తారు? ఫలితాలు అంత త్వరగా ఎలా వెల్లడవుతాయో ఒకసారి చూద్దాం.

– అమెరికాలో ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ఉన్న పెట్టెలో గుర్తు పెడతారు. అనంతరం ఆ బ్యాలెట్ పత్రాలను ప్రత్యేక స్కానింగ్ యంత్రాల్లోకి పంపిస్తారు. ఈ యంత్రాలు బ్యాలెట్‌పై ఉన్న గుర్తులను స్కాన్ చేసి అభ్యర్థుల వారీగా ఓట్లను ఆటోమేటిక్‌గా లెక్కిస్తాయి. కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లోనే స్కానింగ్ జరుగుతుంది. మరికొన్ని చోట్ల ప్రత్యేక లెక్కింపు కేంద్రాలకు బ్యాలెట్ పత్రాలను తరలిస్తారు. పెద్ద లెక్కింపు కేంద్రాల్లో ఉండే హైస్పీడ్ స్కానర్లు గంటకు వేలాది బ్యాలెట్ పత్రాలను పరిశీలించగలవు.

– అమెరికాలో ఓటు వేసేది కాగితంపైనే అయినా లెక్కించేది మాత్రం యంత్రాలే. అందుకే పెద్దసంఖ్యలో ఓట్లను తక్కువ సమయంలో లెక్కించడం సాధ్యమవుతోంది. అమెరికాలో ఎన్నికల ఫలితాలు వేగంగా వెల్లడవడానికి మరో ముఖ్యమైన కారణం ముందస్తు ఓటింగ్. అక్కడి రాష్ట్రాల నిబంధనలను బట్టి ఓటర్లు పోలింగ్ రోజుకు ముందే ఓటు వేయవచ్చు. పోస్టు ద్వారా కూడా బ్యాలెట్ పత్రాలను పంపవచ్చు. తాజాగా నవంబరు 3న జరిగిన మధ్యంతర ఎన్నికలకు ముందే 5.7 కోట్ల మందికి పైగా ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఫ్లోరిడా యూనివర్సిటీ ఎలక్షన్ ల్యాబ్ వెల్లడించింది.



– భారత్‌లో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం కీలక బాధ్యత వహిస్తుంది. కానీ అమెరికాలో ఎన్నికల నిర్వహణ ప్రధానంగా రాష్ట్రాలు, స్థానిక సంస్థల పరిధిలో ఉంటుంది. దేశవ్యాప్తంగా వేలాది స్థానిక ఎన్నికల యంత్రాంగాలు ఓట్ల లెక్కింపును నిర్వహిస్తాయి. 2026 మధ్యంతర ఎన్నికల్లో అమెరికా వ్యాప్తంగా 10 వేలకు పైగా స్థానిక లెక్కింపు కేంద్రాల్లో ఓట్ల ప్రక్రియ కొనసాగింది. ప్రతి కేంద్రంలో లెక్కించిన ఓట్ల వివరాలను సంబంధిత అధికారులకు పంపిస్తారు. అక్కడి నుంచి రాష్ట్రస్థాయి ఫలితాలు వెలువడతాయి.

అమెరికా మధ్యంతర ఎన్నికలు
సత్తాచాటిన ప్రవాస భారతీయులు

◆ పియా దాండియా



అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతికి చెందిన నేతలు ప్రభంజనం సృష్టిస్తున్నారు. చరిత్రను కూడా నెలకొల్పుతున్నారు. ఫ్లోరిడా 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ నుంచి బరిలో నిలిచిన డెమోక్రాటిక్ అభ్యర్థి పియా దాండియా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిన కేసీ అస్కర్‌ని ఓడించారు. ఫ్లోరిడా నుంచి అమెరికా దిగువ సభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్‌గా చరిత్ర నెలకొల్పారు.

◆ రోహిత్ మల్హోత్రా



జార్జియాలోని ఫుల్టన్ కౌంటీ కమిషన్ డిస్ట్రిక్ట్ 4 స్థానానికి జరిగిన ప్రత్యేక ఎన్నికలో నలుగురు అభ్యర్థులు పోటీపడగా, భారతీయ–అమెరికన్ డెమొక్రాట్ రోహిత్ మల్హోత్రా దాదాపు మూడింట రెండు వంతుల ఓట్లతో విజయం సాధించారు. మల్హోత్రా 46,103 ఓట్లు (67 శాతం) పొందగా, తోటి డెమొక్రాట్ ఆరోన్ శాంప్సన్ 16,906 ఓట్లతో (24 శాతం) రెండవ స్థానంలో నిలిచారు.

◆ అమీ బేరా



డెమోక్రెటిక్ అభ్యర్థి భారతీయ అమెరికన్ అమీ బేరా కాలిఫోర్ని యాలోని 3వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఆయన ప్రత్యర్థి రిపబ్లికన్ అభ్యర్థి రాబ్ టక్కర్‌ను ఓడించి అమీ బేరా యూఎస్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు తిరిగి ఎన్నికయ్యారు. ఇలా ఎన్నిక కావడం ఇది ఎనిమిదో సారి.

◆ రో ఖన్నా



సిలికాన్ వ్యాలీలోని ఫ్రీమాంట్‌లో నివసిస్తూ తెలుగువారికి సుపరిచితుడైన రో ఖన్నా అమెరికా ప్రతినిధుల సభ ఎన్నిక ల్లో కాలిఫోర్నియా 17వ జిల్లా నియోజకవర్గం నుంచి గెలిచారు. తన ప్రత్యర్థి రిపబ్లికన్ అభ్యర్థి రితేష్ టండన్‌పై విజయం సాధించారు. 1976లో ఫిలడెల్ఫియాలో భారతీయ తల్లిదండ్రులకు ఆయన జన్మించారు.

వాల్ట్‌డిస్నీ వరల్డ్ మ్యాజిక్ కింగ్‌డమ్‌లో
బర్మింగ్‌హామ్ నృత్య అకాడమీ ప్రదర్శన



బర్మింగ్‌హామ్ (యూకే): పదేళ్ల ప్రస్థానాన్ని ఘనంగా జరుపుకుంటున్న బర్మింగ్‌హామ్‌కు చెందిన ఇండియా ఐలాండ్ అకాడమీ (ఐఐఏ) అంతర్జాతీయ స్థాయిలో చరిత్ర సృష్టించింది. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం ఓర్లాండోలో ఉన్న ప్రపంచ ప్రసిద్ధ వాల్ట్‌డిస్నీ వరల్డ్‌లోని మ్యాజిక్ కింగ్‌డమ్‌లో పదర్శన ఇచ్చేందుకు ఎంపికైన తొలి బ్రిటిష్ నృత్య అకాడమీగా ఈ సంస్థ గుర్తింపు పొందింది. 2016లో సంధ్య అయ్యా స్థాపించిన ఈ అకాడమీ, జష్న్ ప్రొడక్షన్స్ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'దీపావళి డ్యాన్స్ ఫెస్ట్– 2026లో యునైటెడ్ కింగ్‌డమ్ తరపున ఏకైక ప్రతినిధిగా ఎంపికైంది. అమెరికాలోని 21 నృత్య పాఠశాలలతో పాటు, సిడ్నీ, ట్రినిడాడ్, కెనడా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన నాలుగు అంతర్జాతీయ బృందాలు ఈ వేడుకలో పాల్గొన్నాయి. దక్షిణాసియా కళలు, సంస్కృతిలోని వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. అక్టోబరు 23, 24 తేదీల్లో వాల్ట్ డిస్నీ వరల్డ్‌లోని మ్యాజిక్ కింగ్ డమ్‌లో రెండు ప్రదర్శనలతో ఆకట్టుకుంది.

శ్రీవారి మెట్ల మార్గంలో ఎన్ఆర్ఐ మృతి

తిరుమల: శ్రీవారి మెట్లమార్గంలో వెళుతున్న తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని లాలాగూడకు చెందిన సింగిరెడ్డి సుర్జీత్‌రెడ్డి (52) మృతిచెందారు. మంగళవారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి మెట్ల మార్గంలో నడుస్తుండగా 700 మెట్టు వద్ద అకస్మాత్తుగా కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన తితిదే భద్రతా సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు పేర్కొన్నారు. గుండెపోటుతోనే ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. సుర్జీత్ తల్లి సాధన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు వెల్లడించారు. సుర్జీత్‌రెడ్డి అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడినట్లు సమాచారం.



అమెరికా, భారత్‌లో నాట్స్ సేవలు



అమెరికా: నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (ఎన్ఏటీఎస్) అమెరికా, తెలంగాణలో సేవా కార్యక్రమాలు, వైద్యశిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో తన సేవలను కొనసాగించింది. అధ్యక్షుడు రాజ్ అచ్చాడ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమాలకు సంస్థ చైర్మన్ కిషోర్ కంచర్ల అభినందనలు తెలిపారు. తెలంగాణలోని ఘట్‌కేసర్ మండలం, మేడిపల్లి గ్రామంలో ఉన్న మాతృ అభయ ఫౌండేషన్ అనాథాశ్రమానికి నాట్స్ రూ.3 లక్షల విలువైన వంట సామగ్రిని విరాళంగా అందించింది. ప్రముఖ టీవీ యాండర్ సుమ కనకాల నిర్వహిస్తున్న 'ఫెస్టివల్స్ ఫర్ బాయ్' కార్యక్రమంతో కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. సంస్థ తరపున సినీ రచయిత సిరాశ్రీ ఈ కార్యక్రమ ఐదో వార్షికోత్సవ షీల్డ్ అందుకున్నారు. అలాగే, న్యూబెర్సీ, మిస్సోరి, డల్లాస్, మిచిగన్, టాంపా ప్రాంతాల్లో చేపూ వైద్యశిబిరాలు నిర్వహించింది. 1,000 మందికి పైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, నిపుణుల సలహాలు అందించారు. డల్లాస్ కాపర్ కో–ఆర్డినేటర్లు కిరణ్ నారే, పవని నున్నా, వైద్యశిబిరం కో ఆర్డినేటర్లు సౌజన్య రావెళ్ల, కృష్ణ వ్యాకరణం, ఎగ్జిక్యూటివ్ వెబ్ సెక్రటరీ కిషోర్ నారే ఈ కార్యక్రమాన్ని ముందుండి నిర్వహించారు. జాతీయ నాయకులు, వాలంటీర్లు, 15 మందికి పైగా విద్యార్థి వాలంటీర్లు కూడా సహకరించారు. ఈ శిబిరంలో గ్యాస్ట్రో ఎంట రాలజిస్ట్ డాక్టర్ జనార్ధన్ బొల్లు, కార్డియాలజిస్ట్ వెంకటరవి, ఎస్.ఆకుల, పీడియాట్రిషన్ విజయ నిమ్మల సేవలందించారు. యుపీఏఎస్ఏ, సాయి దత్తపీఠం, ఎన్ఏటీఎస్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్ అల్లాడ పాల్గొన్నారు. రాప్టర్ నాయకుడు సాయి గంగుల శిబిరానికి నాయకత్వం వహించారు. శ్రీదేవి మానేపల్లి నాయకత్వంలో కొత్తగా ఏర్పాటైన నాట్స్ మిచిగన్ రాప్టర్ తన తొలి కార్యక్రమంగా పక్ష వ్యాక్సినేషన్ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించింది. నాట్స్ శాన్ డియాగో డాప్టర్ "స్వరాభిషేకం' పేరుతో ఘనంగా భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించింది. త్యాగరాజు, అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు కీర్తనలను సంగీత ఉపాధ్యాయులు, విద్యార్థులు అలపించారు. పిల్లలు



ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి 100కు పైగా తెలుగు కుటుంబాలు హాజరై సంగీతాన్ని ఆస్వాదించాయి. శాన్ డియాగో బృందంలో కొత్తగా చేరిన పవన్ సిరువూరును నాట్స్ ఆహ్వానించింది. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాకారులు, అతిథులు, వాలంటీర్లకు రాప్టర్ కృతజ్ఞతలు తెలిపింది. ముఖ్యంగా సాంస్కృతిక కో–ఆర్డినేటర్ కామ్య శిష్టా, ప్రధాన కో–ఆర్డినేటర్ ప్రశాంతి ఉడుముడి, సుష్మ శిష్టా, ఆమె విద్యార్థులు, పవన్, రామ్ ఉడుముడి సేవలను అభినందించింది. నాట్స్ న్యూజెర్సీ చాప్టర్, గుడ్ వైబ్స్‌తో కలిసి గాయని సమీరా భరద్వాజ్ సంగీత కచేరి నిర్వహించింది.





అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

సర్వీస్ కాలం రెండేళ్లు పెంపు

ఢిల్లీ: అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. అగ్నిపథ్ పథకం సర్వీస్ కాలాన్ని రెండేళ్లు పొడిగించింది. ఈ విషయాన్ని చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎన్.రాజా సుబ్రమణి బుధవారం వెల్లడించారు. సాధారణంగా అగ్నివీర్‌లకు నాలుగేళ్ల సర్వీస్ కాలం ఉంటుంది. ఇది పూర్తయ్యాక వీరిలోని 25 శాతం మంది త్రివిధ దళాల శాశ్వత కేడర్‌కు ఎంపిక అవుతారు. అయితే ఎంపికవ్వని 75 శాతం మంది కోసం అగ్నిపథ్ సర్వీస్ కాలాన్ని కేంద్రం నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు పెంచింది. దీంతో ఆ 75 శాతం అగ్నివీర్‌లకు శాశ్వత కేడర్‌లో చేరేందుకు మరో అవకాశం దొరకనుంది. 2022లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం మంచి ఫలితాలనిచ్చిందని సుబ్రమణి తెలిపారు. కాగా నౌకాదళ అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం నవంబరు 21తో, వైమానిక దళ అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 21తో, సైన్యం మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 31తో ముగియనుంది. నాలుగేళ్ల క్రితం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో మొదటి విడతలో 24,400 మంది అగ్నివీర్‌లు చేరారు. ఈ పథకం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ నాలుగేళ్లలో సైన్యంలో సుమారు 2,70,000 మంది, వాయుసేనలో 27,000 మంది, నేవీలో 21,000 మంది అగ్నివీర్‌లుగా నియమితుల య్యారు. అగ్నిపథ్ సర్వీస్ కాలంలో కేవలం ఫిట్‌నెస్‌పైనే దృష్టి పెట్టకుండా.. నైతిక విలువలు, నైపుణ్యాలూ నేర్పిస్తామని సీడీఎస్ జనరల్ ఎన్.ఎన్.రాజా సుబ్రమణి వెల్లడించారు.

దేశీ జీపీఎస్‌లో కీలక అడుగు



ఢిల్లీ: స్వదేశీ నేవిగేషన్ వ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగుపడింది. ఇటీవల జీఎస్‌ఎల్వీ ఎఫ్-18 నింగిలోకి తీసుకె ళ్లిన ఎన్ వీఎస్-03 (ఎన్‌వీఎస్-03) నేవిగేషన్ ఉపగ్రహానికి కక్ష్య పెంపు విన్యాసాన్ని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విజయవంతంగా చేపట్టింది. నిర్దేశిత జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అమెరికా జీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఇస్రో సొంతంగా నావిక్ వ్యవస్థ కోసం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డం కులు ఎదురవుతూనే ఉన్నాయి. గతంలో ప్రయోగించిన కొన్ని ఉపగ్రహాల్లో పలు అణు గడియారాల్లో తలెత్తిన సాంకేతిక సమస్యలు, ఎన్వీఎస్-02 ప్రయోగం విఫలం కావడంతో నావిక్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. ఇప్పుడు ఎన్వీఎస్-03 నిర్దేశిత కక్ష్యకు చేరడం విజయంగా భావిస్తున్నారు. దీంతో నేవిగేషన్ సేవల సామర్థ్యం మరింత పెరగనుంది. నావిక్ వ్యవస్థ ద్వారా భారత భూభాగంతోపాటు సరిహద్దుల వెలుపల సుమారు 1500 కిలోమీటర్ల పరిధిలో అత్యంత కచ్చితమైన సమాచార సేవలు అందనున్నాయి. రవాణా, విమానయానం, సముద్ర ప్రయాణాలు, వాహనాల పర్యవేక్షణ, అత్యవసర సేవలు తదితర రంగాల్లో ఈ వ్యవస్థ కీలకంగా ఉపయోగపడనుంది.

పేదరికంపై యుద్ధం చేసి చూపించాం

- 12 ఏళ్లలో 50 కోట్ల మందిని బయటకు తీసుకొచ్చాం
- పేదిరకం నిర్మూలనపై ప్రధాని నరేంద్ర మోదీ
- మెట్రో పింక్ లైన్ 3 ప్రారంభం

పుణె: "గతంలో పేదరికంపై యుద్ధమనేది నినాదాలకే పరిమితమైంది. కానీ... 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో దేశంలో 50 కోట్ల మందిని కడు పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చాం. ఇప్పుడు భారతావని పేదరికాన్ని పారదోలుతోంది" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తమ పాలనలో పట్టణాల మౌలిక వసతుల్లో భారీ పరివర్తన వచ్చిందని తెలిపారు.

పేదల సాధికారత, సుపరిపాలన తమ ప్రభుత్వ ముఖ్య లక్షణాలని వెల్ల డించారు. పుణెలో రూ.8,300 కోట్లతో నిర్మించిన మెట్రో పింక్ లైన్ 3ని మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మరో రూ.21,800 కోట్లతో నిర్మించనున్న నాలుగు మెట్రో కారిడార్లకూ ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన



మాట్లాడుతూ 2014 నాటికి 248 కిలో మీటర్లున్న మెట్రో నెట్‌వర్క్ ప్రస్తుతం 1,200 కిలోమీటర్లకు చేరింది. మెరుగైన పట్టణ మౌలికసదుపాయాలు దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తాయి. 2014లో ప్రజలు ఎన్డీయేకు అధికా రం కట్టబెట్టినప్పుడు పట్టణాల్లోని మధ్య తరగతికి సులభతర జీవనం, రవాణా సౌకర్యాలను కల్పించాలని తీర్మానించుకున్నాం. ఆ దిశగా సాగుతున్నాం" అని మోదీ వివరించారు.

రైతులు ఆందోళన చెందొద్దు

కరవు వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకుంటామని ప్రధాని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. దీపావళి సీజన్లో కరవు ప్రాంత రైతులను గుర్తుంచుకోవాలని, వారూ పండగను ఆనందంగా జరుపుకొనేలా చూడాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. "రైతులూ.. ఆందోళన చెందొద్దు. మేమంతా మీ వెంటే ఉంటాం. ఈ సంక్షోభాన్ని సమష్టిగా ఎదుర్కొందాం" అని ప్రధాని పేర్కొ న్నారు. పుణె పింక్లైన్ మెట్రో నిర్వహణలో 50శాతం మంది మహిళలే పని చేస్తున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. రైళ్ల ఆపరేటర్లలో 100 మంది మహిళలేనని వెల్లడించారు. నిర్మాణ సమయంలోనూ మహిళా ఇంజినీర్లు కీలక పాత్ర పోషించారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం 2017లో తీసుకొచ్చిన పబ్లిక్-ప్రైవేటు పార్టనర్షిప్ విధానంలో భాగంగా.. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ వోటీ) పద్ధతిలో నిర్మించిన తొలి మెట్రో ఇదని ఫడణవీస్ తెలిపారు. టాటా రియాలిటీ, సీమెన్స్ సంస్థలు సంయుక్తంగా దీనిని పూర్తి చేశాయని వివరించారు.

ఓటర్ల జాబితాలో పేరులేని వారు

ఫాం 6 ద్వారా అప్లై చేసుకోవచ్చు: ఈసీ

ఢిల్లీ: ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ తర్వాత పబ్లిష్ అయిన ఓటరు జాబితాలో పేరు కోల్పోయిన వారు ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసుకోవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ)తెలిపింది. అలాంటి వారు అంతకుముందు ఓటర్లుగా నమోదై ఉన్నా కూడా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ఈసీ స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈనెల 3న లేఖ రాసింది. ఫాం 6 ద్వారా కొత్తగా అప్లై చేసినా.. చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అలా దరఖాస్తు చేసినంత మాత్రాన తప్పుడు డిక్లరేషన్ ఇచ్చినట్లు కాదని ఈసీ వివరించింది. కాగా.. కొత్తగా విడుదల చేసిన ఓటరు జాబితాలో పలువురు ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయి. దీంతో



అలాంటి వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి సందేహిస్తున్నారు. ఫాం 6 ద్వారా అప్లై చేస్తే తమను ఓటరు జాబితాలో మొదటిసారిగా చేరుస్తారన్న సందేహం వారిలో నెలకొంది. ఈ నేపథ్యంలో ఈసీ క్లారిటీ ఇచ్చిం ది. ఓటరు జాబితాలో పేరులేని వారు కొత్తగా దరఖాస్తు చేసు కోవాల్సిందేనని, ఇలా చేయడం వల్ల ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని, వారు పాత ఓటర్లు అయి ఉన్నా కూడా ఇబ్బందులు ఉండవని ఈసీ స్పష్టం చేసింది. సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే దరఖాస్తుదారులు మరో పార్లమెంటరీ నియోజక వర్గంలో గానీ, అసెంబ్లీ నియోజకవర్గంలో గానీ ఓటరుగా నమోదై ఉండకూడదని ఈసీ తెలిపింది. కాగా.. సర్ ప్రక్రియ తర్వాత విడుదల చేసిన ఓటర్ల జాబితాలో చాలామంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని భారీగా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేప థ్యంలో ఈసీ ఈ మేరకు ఒక క్లారిటీ ఇచ్చింది.

ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ

- సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్

ఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని సెక్షన్ 16 రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు వివాదానికి కారణమైంది. ఈ నిబంధన ప్రకారం.. సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా కొనసాగించకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు. అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగా నికి

పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవు తుందని పేర్కొంటున్నారు. ఇది రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, న్యాయవాది అరుణ్ కుమార్ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు.

తొలుత 2023 బిల్లులో ఎన్నికల కమిషనర్లకు ఇలాంటి సంపూర్ణ రక్షణ కల్పించే నిబంధన లేదని, అనంతరం బిల్లుకు సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ఇందుకు తగిన కారణాల ను ప్రభుత్వం వెల్లడించలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో ససెన్షన్‌లో ఉన్న సమయంలో ఈ రక్షణ నిబంధనతో కూడిన బిల్లును పార్లమెంట్ ఆమోదిం చిందని పిటిషనర్ పేర్కొన్నారు.

అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫైట్

- ట్రంప్‌నకు రెఫరెండం..ఓటెత్తిన పౌరులు
- ముందుగానే ఓట్లేసిన 5.7 కోట్ల మంది
- ఆధిపత్యం దిశగా డెమోక్రాట్లు





వాషింగ్టన్: అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రిఫరెండంగా భావిస్తున్న అమెరికా మధ్యంతర ఎన్నికల పోలింగ్ స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమైంది. ఓటర్లు పోలింగ్ బూత్లకు భారీగా తరలివచ్చారు. అమెరికాలో ముందస్తుగా ఓటేసే అవకాశమున్నందున సోమవా రం నాటికే 5.7 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించు కున్నారు. మిగిలిన దాదాపు 15.3 కోట్ల మంది మంగళవారం ఓటేస్తున్నారు. ఓట్ల లెక్కింపు వెంటనే ప్రారంభమైనా కొన్నిచోట్ల తుది ఫలితాల వెల్లడికి కొన్ని రోజులు పట్టవచ్చు.

ఓటింగ్ తీరు ఇలా...

ఆ అమెరికాలో ముందుగానే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేయ వచ్చు. ఈ అవకాశం 1 రాష్ట్రాలతోపాటు వాషింగ్టన్ డీసీలోనూ ఉంది. దీంతో పాటు ఈమెయిల్ ద్వారానూ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ముందుగానే పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓబేసినవారు 3 కోట్లకుపైగా ఉన్నారు. ఆ ఈమెయిల్ ద్వారా ఓటేసిన వారు 2.5 కోట్లకు పైగా ఉన్నారు. 1.1 కోట్ల మంది డెమోక్రాట్లు ముందుగానే ఓటు వేశారు. 80 లక్షల మంది రిపబ్లికన్లు ముందుగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన వారంతా ఏ పార్టీకి అనుబంధంగా లేనివారు. అంటే తటస్థులు. వ్యోమగాములు అనిల్ మేనన్, ట్యూన్ డెనీ, జెస్సికా వాట్కిన్స్ను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచే ఓటేశారు. కాగా కాలిఫోర్నియాలో ఈమెయిల్ బ్యాలెట్ ద్వారా వచ్చిన వేల ఓట్లను పక్కనబెట్టాలని ట్రంప్ యంత్రాంగం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. వారంతా అమెరికా పౌరులు కాదన్న వాదనలను తోసిపుచ్చింది.

డెమోక్రాట్ల జోరు

మంగళవారం నాటికి డెమోక్రాట్లకు మద్దతిస్తున్న వారు 51.5 శాతంగా, రిపబ్లికన్లకు మద్దతిస్తున్న వారు 43.1 శాతంగా ఉన్నట్లు నేషనల్ పోల్లో వెల్లడైంది. చరిత్ర, ముందస్తు ఓటింగ్ సరళిని చూస్తే ట్రంప్‌నకు ఇబ్బందికరంగానే ఉందని రాజకీయ విశ్లేష కులు అంటున్నారు. అయితే ఎన్నికల జిల్లాల పునర్వ్యవస్థీకరణతో విజయం సాధిస్తామనే నమ్మకంతో రిపబ్లికన్లున్నారు.

గవర్నర్ గిరీలో శ్వేతజాతీయుల ఆధిపత్యం

అమెరికా 250 ఏళ్ల చరిత్రలో 2000 మందికి పైగా గవర్న రుగా పనిచేశారు. వారిలో 99 శాతానికి పైగా శ్వేత జాతీయులే కావడం గమనార్హం. ప్రస్తుతం ఒక్క మేరీలాండ్లో ఆఫ్రో అమెరికన్ వెన్ మూర్ గవర్నర్గా ఉన్నారు. ఇప్పటిదాకా ఏ ఒక్క ఆఫ్రో అమెరికన్ మహిళగానీ, నేటివ్ అమెరికన్ మహిళగానీ అమెరికాలో గవర్నర్గా పనిచేయలేదు. హిస్పానిక్ బనాభా అధికంగా ఉన్న టెక్సాస్కు ఇంతవరకూ ఏ ఒక్క లాటినో గవర్నర్ కాలేదు. ఈసారి ఎన్నికల్లో రెండు పార్టీల తరఫున ఏడుగురు ఆఫ్రో అమెరికన్లు గవర్నర్ల పదవులకు పోటీ పడుతున్నారు. వారిలో ఎవరు గెలిచినా ఆయా రాష్ట్రాలకు తొలి ఆఫ్రో అమెరికన్ గవర్నర్ అవుతారు.

ఓట్ల లెక్కింపు ఇలా ఉంటుంది

ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యాక 50 శాతం ఓట్లు సాధించిన వారు గెలుస్తారు. తొలి ప్రాధాన్య ఓట్లలో ఎవరికీ 50 శాతం ఓట్లు రాకపోతే అతి తక్కువ తొలి ప్రాధాన్య ఓట్లు వచ్చిన అభ్యర్థిని తొల గించి.. రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. దీనివల్ల లెక్కింపు ఆలస్యమయ్యే అవకాశముంది.

అమెరికాకు తొలి ముస్లిం సెనెటర్

ఆయన భార్యకు భారతీయ మూలాలు



అమెరికా: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో మిచిగన్ రాష్ట్రం నుంచి బరిలో దిగిన డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయీ ద్ ఘన విజయం సాధించారు. తొలి ముస్లిం సెనెటర్గా నిలిచి ఆయన చరిత్ర సృష్టించారు. అయితే ఈ విజయం తరువాత ఒక్క సారిగా కర్ణాటకలోని ఓ చిన్న పల్లెటూరు ట్రెండింగ్లో వచ్చింది. ఎందుకంటారా..? ఆ గ్రామంతో అబ్దుల్ భార్య డాక్టర్ సారా జుకా కు ప్రత్యక్ష సంబంధముంది కాబట్టి. గతంలో ఆమె కుటుంబం మైసూరుకు 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న భత్కల్ అనే ఊరిలో నివసించేది. సారా తండ్రి జుకాకు తయ్యబ్ చిన్నతనం అదే గ్రామంలో గడిచింది. తరవాత ఆయన ఎమ్.బి.బి.ఎస్ పూర్తి చేసి అమెరికా వెళ్లిపోయారు. అక్కడ నెఫ్రాలజిస్ట్గా సేవలందిస్తూ స్థిరపడిపోయారు. కొంతకాలానికి యూఎస్లోని మిచిగన్ రాష్ట్రం లో జుకాక్ తయ్యబ్కు సారా జన్మించారు.

చిన్నప్పటి నుంచి ఆమె కు వైద్యరంగం పట్ల ఆసక్తి ఉంది. అందుకే కొలంబియా వర్సిటీలో డాక్టర్ పట్టా అందుకున్నారు. తరువాత మిచిగన్ యూనివర్సిటీలో సైకియాట్రిస్ట్గా ప్రాక్టీస్ చేశారు. ఆ సమయంలోనే అబ్దుల్ను సారా తొలిసారి చూశారు. అక్కడ వీరి పరిచయం ప్రేమగా మారి 2006లో పెళ్లి పీటలు ఎక్కేలా చేసింది. కాగా మిచిగన్ రాష్ట్రం నుంచి బరిలో దిగిన అబ్దుల్ కోసం సారా ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి తొలి ముస్లిం సెనెటర్గా అబ్దుల్ నిలిచిన విషయం తెలిసిందే. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి మైక్ రాజర్స్పై ఆయన రెండు లక్షల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ నేపథ్యంలో తొలి ముస్లిం సెనెటర్ భార్యకు భారతీయ మూలా లు ఉండడం ఆసక్తికరంగా మారింది.

సత్తా చాటిన భారతీయులు



అమెరికా: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతి అభ్యర్థులు సత్తా చాటారు. ముఖ్యంగా డెమోక్రాట్ పార్టీ తరఫున పోటీ చేసిన భారతీయ అమెరికన్లు పలు కీలక స్థానాల్లో విజయం సాధించారు. ఇప్పటికే కాంగ్రెస్లో కొనసాగుతున్న నలుగురు భారత సంతతి నాయకులు మరోసారి ఎన్నికవగా, పియా దండి యా తొలిసారి అమెరికా ప్రతినిధుల సభలో అడుగుపెట్టనున్నారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసిన వివేక్ రామస్వామి కి ఓటమి ఎదురైంది. అమెరికా ప్రతినిధుల సభకు జరిగిన ఎన్నికల్లో భారత సంతతికి చెందిన అమీ బేరా, రో ఖన్నా, సుహాస్ సుబ్రహ్మణ్యం, ప్రమీలా జయపాల్ మరోసారి విజయం సాధించా రు. కాలిఫోర్నియాలోని మూడో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి అమీ బేరా ఎనిమిదోసారి ఎన్నికయ్యారు. కాలిఫోర్నియాలోని 17వ నియోజకవర్గం నుంచి రో ఖన్నా గెలుపొందారు. వర్జీనియాలోని పదో నియోజకవర్గం నుంచి సుహాస్ సుబ్రహ్మణ్యం మరోసారి విజయం సాధించారు. వాషింగ్టన్ ఏడో నియోజకవర్గం నుంచి ప్రమీలా జయపాల్ ఆరోసారి గెలిచారు. ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి డెమోక్రాట్ అభ్యర్థి పియా దండియా విజయం సాధించారు. రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్కర్ను ఓడించి ఆమె తొలిసారి అమెరికా కాంగ్రెస్లోకి ప్రవేశించనున్నారు. గతంలో ఉపాధ్యాయురాలిగా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన పియా దండియా పామ్ బీచ్ కౌంటీలోనే జన్మించి పెరిగారు. ఆమెకు 51.9 శాతం ఓట్లు లభించాయి. మేరీల్యాండ్ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్గా పనిచేస్తున్న భారత సంతతికి చెందిన అరుణా మిల్లర్ మరోసారి విజయం సాధించారు. డెమోక్రాట్ పార్టీకి చెందిన ఆమె గవర్నర్ వెస్ మూర్తో కలిసి పోటీ చేసి తిరిగి పదవిని నిలబెట్టుకున్నారు.

వివేక్ రామస్వామికి ఎదురుదెబ్బ

కాగా భారత సంతతికి చెందిన రిపబ్లికన్ నాయకుడు వివేక్ రామస్వామికి ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో ఓటమి ఎదురైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ఉన్నప్పటికీ ఆయన డెమోక్రాట్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఓడిపోయారు. అలాగే నార్త్ కరోలినా రాష్ట్రంలోని నాలుగో కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన రిపబ్లికన్ అభ్యర్థి మహేశ్ గనోర్కర్ కూడా ఓటమి పాలయ్యారు.

అమెరికా కాంగ్రెస్‌లో డెమోక్రాట్‌ల ఆధిపత్యం

వీటో అంటూ ట్రంప్ సంచలన పోస్ట్



అమెరికా: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ఘన విజయం సాధించారు. సెనేట్తో పాటు ప్రతినిధుల సభలోనూ మెజారిటీ సాధించి రిపబ్లికన్ల ఆధిపత్యానికి తెరదించారు. దీంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా కీలక సవాలు ఎదురుకానుంది. వచ్చే రెండేళ్ల పాటు ఆయన ప్రభుత్వ నిర్ణయాలపై డెమోక్రాట్లు గట్టి నిఘా పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్లో 'వీటో' అని రాసి ఉన్న ఎరుపు రంగు రిపబ్లికన్ టోపీ ఫొటోను పోస్ట్ చేశారు. 2026 నవంబర్ 3న జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు అనూహ్య విజయాలు సాధించారు. తాజా లెక్కల ప్రకారం సెనేట్లో 100 స్థానాలకు గాను 53 స్థానాలను గెలుచుకున్నారు. ప్రతినిధుల సభలోనూ మెజారిటీకి అవసరమైన 218 స్థానాల మార్కును దాటి 220 స్థానాలను కైవసం చేసుకున్నారు. దీంతో రెండు సభల్లోనూ డెమోక్రాట్లకు ఆధిపత్యం లభించింది. టెక్సాస్, కాన్సాస్, సౌత్ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ ఆధిపత్య రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఈ ఎన్నికల్లో ప్రత్యేకతగా నిలిచింది. నార్త్ కరోలినా, ఒహాయో రాష్ట్రాల్లోనూ సెనేట్ స్థానాలను గెలుచుకున్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ట్రంప్ సోషల్ మీడియాలో స్పందించారు. ఎరుపు రంగు రిపబ్లికన్ టోపీపై 'వీటో' అని రాసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు. డెమోక్రాట్లు తీసుకొచ్చే ప్రతిపాదనల్లో తనకు ఆమోదయోగ్యం కాని వాటిని అడ్డుకునేందుకు అధ్యక్షుడిగా తనకున్న వీటో అధికారాన్ని ఉపయోగిస్తాననే సంకేతాన్ని ఈ పోస్ట్ ద్వారా ఇచ్చారు. కాంగ్రెస్లో డెమోక్రాట్లకు మెజారిటీ రావడంతో ట్రంప్ ప్రభుత్వానికి పలు అంశాల్లో ఇబ్బందులు ఎదురుకావచ్చు. ప్రభుత్వ నిర్ణయాలపై విచారణలు చేపట్టడం, పరిపాలనా వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తడం, కొత్త చట్టాల ఆమోదాన్ని అడ్డుకోవడం వంటి అధికారాలు వారికి ఉంటాయి.

ట్రంప్‌నకు మద్దతు ఇచ్చిన తెలుగు మహిళకు షాక్

సరితా కోమటిరెడ్డి ఓటమి!



అమెరికా: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో తెలుగు మహిళ సరితా కోమటిరెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ట్రంప్ మద్దతుతో న్యూయార్క్ అటార్నీ జనరల్ పదవి కోసం బరిలోకి దిగిన ఆమెకు ఓటమి ఎదురైంది. సరితపై డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి లెటిటియా జేమ్స్ విజయం సాధించారు. అనంతరం ఈ ఫలితాలపై సరిత స్పందించారు. తన ఓటమిని అంగీకరిస్తున్నానని ఆమె తెలిపారు. ప్రజాసేవ కోసం మాత్రమే తాను ఎన్నికల్లో పోటీ చేశానని చెప్పారు. ఎన్నికల్లో ఓడినప్పటికీ ప్రజాసేవను వదలబోనని పేర్కొన్నారు. న్యూయార్క్ నగరాన్ని మరింత సురక్షితంగా మార్చడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని వెల్లడించారు. కాగా సరితా కోమటిరెడ్డికి న్యాయ రంగంలో ఎనలేని అనుభవం ఉంది. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, సైబర్ నేరాలు, మనీలాండరింగ్ కేసులను ఆమె వాదించారు. సరిత తల్లిదండ్రులు డాక్టర్ హనుమంతరెడ్డి, డాక్టర్ గీత తెలంగాణలోని కరీంనగర్ జిల్లా వాసులు. వారు 1980వ దశకంలో భారత్ను వదలి అమెరికాకు వలస వెళ్లి స్థిరపడ్డారు. తాను బ్రూక్లిన్లో జన్మించానని సరిత ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

కివీస్‌పై భారత్ ఘన విజయం





హాఫ్ సెంచరీతో రాణించిన కోహ్లీ

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో నాలుగు వికెట్ల తేడాతో(డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) భారత్ ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజి లాండ్.. 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. అనంతరం వర్షం అంతరాయం కలిగించడంతో టార్గెట్ 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(74) అర్ధ సెంచరీతో రాణించడంతో భారత్ 22.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా 1-0 ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. దీంతో న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ దిగింది. ఈ క్రమంలో భారత బౌలర్ల ధాటికి కివీస్ 40.2 ఓవర్లలో 185 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ టిమ్ సీఫర్ట్(38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. గ్లెన్ ఫిలిప్స్(30), టిక్నర్(34), డారిల్ మిచెల్(28), డఫీ(18) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. విల్ యంగ్(9), నికోల్స్(9), టామ్ లాథమ్ (3), శాంట్నర్(4), స్మిత్(1), జెమీసన్(1) విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 4, గుర్నూర్ బ్రార్ 3, అన్షుల్ కాంబోజ్ 2 వికెట్లతో చెలరేగారు. అనంతరం స్వల్ప లక్ష్యంగాతో బ్యాటింగ్ దిగిన భారత్‌కు ఆరంభంలోనే బిగ్ షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ పరుగులు ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత వన్ డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీ(74), కెప్టెన్ శుబ్‌మన్ గిల్(37)తో కలిసి స్కోర్ బోర్డును కదిలించాడు. వీరిద్దరూ కలిసి 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొ ల్పారు. 114 పరుగుల వద్ద నాథన్ స్మిత్ బౌలింగ్‌లో గిల్ పెవిలియన్ చేరాడు. ఈ క్రమంలోనే పలుమార్లు వర్షం అంత రాయం కలిగించడంతో డక్‌వర్త్ లూయిల్ పద్ధతిలో టార్గెట్‌ను 32 ఓవర్లలో 143 పరుగులకు కుదించారు. ఈ క్రమంలో ఐదు వికెట్లు కోల్పోయిన భారత్ 22.2 ఓవర్లలో 143 పరుగులు చేసింది. కివీస్ బౌలర్లలో డఫీ మూడు వికెట్లు సాధించాడు. జెమీసన్, నాథన్ స్మిత్ చెరో వికెట్ తీశారు.

సచిన్ రికార్డ్ కోహ్లీ బద్దలు



క్రికెట్ ప్రపంచంలో రికార్డుల రారాజుగా కొనసాగుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. బుధవారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో అర్ధ సెంచరీతో రాణించిన కోహ్లీ(74).. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు. వన్డే క్రికెట్‌లో లక్ష్య ఛేదనలోఅత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ల జాబితాలో విరాట్ అగ్రస్థానంలో నిలిచాడు. అక్లాండ్ వేదికగా ఇవాళ న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 74 పరుగులు చేసిన కోహ్లీ.. టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఇన్నింగ్స్‌తో వన్డే ఛేజింగ్‌లో కోహ్లీ 8,741 పరుగులు సాధిం చాడు. ఇప్పటివరకు ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (8,720 పరుగులు) అగ్రస్థానంలో ఉండగా.. తాజాగా కోహ్లీ ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఈ ఘనత సాధించే క్రమంలో కోహ్లీ సాధించిన గణాంకాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. సచిన్ 242 మ్యాచ్‌ల్లోని 232 ఇన్నింగ్స్‌ల్లో 8,720 పరుగులు చేయగా.. కోహ్లీ కేవలం 180 మ్యాచ్‌ల్లో 169 ఇన్నింగ్స్‌ల్లో 8,741 పరుగులు సాధించాడు. ఇక బ్యాటింగ్ సగటు పరంగా చూసిన విరాట్ కోహ్లీ ఆధిపత్యమే కనిపిస్తోంది. ఛేజింగ్‌లో కోహ్లీ బ్యాటింగ్ సగటు ఏకంగా 66.21గా ఉండగా, సచిన్ సగటు 42.33 మాత్రమే ఉంది. లక్ష్య ఛేదనలో కోహ్లీ ఇప్పటివరకు 30 సెంచరీలు, 46 అర్ధశతకాలు సాధించగా, సచిన్ 17 సెంచరీలు, 52 హాఫ్ సెంచరీలు బాదాడు. ఒత్తిడిని జయించడం, లక్ష్యాన్ని సులువుగా ఛేదించడంలో తనకు ఎవరు సాటిలేరని ఈ గణాంకాలతో విరాట్ కోహ్లీ మరోసారి నిరూపించాడు. ఇవాళ న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ సాధించిన ఘనతతో క్రికెట్ చరిత్రలో 'ఛేజ్ మాస్టర్'గా అతడి కీర్తి మరింత ఇనుమడించింది.

వన్డేల్లో ఛేజింగ్ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లు

విరాట్ కోహ్లీ (భారత్) - 169 ఇన్నింగ్స్, 8741 పరుగులు
సచిన్ టెండూల్కర్ (భారత్) - 232 ఇన్నింగ్స్, 8720 పరుగులు
రోహిత్ శర్మ (భారత్) - 163 ఇన్నింగ్స్, 6801 పరుగులు
సనత్ జయసూర్య (శ్రీలంక) - 210 ఇన్నింగ్స్, 5742 పరుగులు
జాక్వెస్ కల్లిస్ (దక్షిణాఫ్రికా) - 158 ఇన్నింగ్స్, 5575 పరుగులు



కళ్లతో అయ్యర్..
రవిశాస్త్రి ఇమిటేట్

ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ ఘన విజయం సాధించింది. స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ(74) పరుగులతో రాణించి.. టీమిండియా విజయంలో కీలత పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో ఐదో మ్యాచుల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. శ్రేయస్ అయ్యర్ కళ్ల కసరత్తును కామెంటరీ బాక్స్?లో ఉన్న రవిశాస్త్రి అనుకరించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమిండియా ఇన్నింగ్స్ సమ యంలో డగౌట్‌లో ఉన్న శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్ చేసేందుకు రెడీ అయ్యాడు. ఈ క్రమంలోనే ఏకాగ్రత కోసం అతడు తన రెండు కళ్లను అటూఇటూ తిప్పుతూ తనదైన శైలీలో కసరత్తులు చేశాడు. అదికాస్తా గ్రౌండ్‌లో ఉన్న పెద్ద స్క్రీన్‌పై కనిపించింది. ఈ అసాధారణమైన కదలిక మ్యాచ్ చూస్తున్న ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అలానే తన కళ్ల కసరత్తులను పెద్ద స్క్రీన్ పై చూసిన శ్రేయస్ అయ్యర్ తెగ నవ్వేశాడు. మరోవైపు కామెంటరీ బాక్స్‌లో ఉన్న రవిశాస్త్రి కూడా అయ్యర్ కసరత్తులను గమనించాడు. అంతేకాక శ్రేయస్ అయ్యర్‌ను ఇమిటేట్ చేశాడు. అయితే శ్రేయస్ అయ్యర్ చేసిన కళ్ల వ్యాయామం అనేది శిక్షణలో ఒక అంశమని క్రీడా నిపుణులు చెబుతున్నారు. ఇది బ్యాటర్లకు వేగంగా వస్తున్న బంతిపై ఏకాగ్రత్తను మెరుగుపరచడానికి, చేతి-కంటి సమన్వ యాన్ని కాపాడుకోవడానికి సహాయపడుతుందట. మొత్తంగా మైదానం లోపలే కాకుండా వెలుపల జరిగే సంఘటనలు కూడా కొన్నిసార్లు క్రికెట్‌తో సమానంగా వినోదాన్ని అందిస్తాయని ఈ ఘటన నిరూపించింది.

తెరపైకి మరో ట్రేడ్ డీల్..
రూ.13 కోట్ల స్టార్ క్రికెటర్‌పై సీఎస్కే కన్ను!



ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందే ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్ వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ట్రేడ్‌పై భారీ చర్చ జరుగుతుండగా.. తాజాగా మరో కీలక ఆటగాడి పేరు తెరపైకి వచ్చింది. ఇంగ్లండ్ విధ్వంసకర ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి అతడిని ట్రేడ్ చేసుకునే అవకాశాలను సీఎస్కే పరిశీలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ 2026 వేలానికి ముందు లియామ్ లివింగ్‌స్టోన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ ఏకంగా రూ.13 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్‌లో అతడి ప్రదర్శన ఏమాత్రం ఆశించిన స్థాయిలో లేదు. కేవలం రెండు మ్యాచ్‌లు ఆడిన లివింగ్‌స్టోన్ 15 పరుగులు మాత్రమే చేశాడు. పేలవ ఫామ్ కారణంగా మిగిలిన సీజన్‌లో తుది జట్టులోనే కాకుండా ఇంపాక్ట్ ప్లేయర్‌గా కూడా అవకాశం దక్కించుకో లేకపోయాడు. ఈ నేపథ్యంలో అతడిని వదులుకునేందుకు ఎస్ఆర్‌హెచ్ సిద్ధమైనట్లు సమాచారం. దీంతో తమ జట్టులో ఓ విదేశీ ఆటగాడి కోసం సీఎస్కే పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

పాక్ బాక్సర్‌ను చెంపదెబ్బ

భారత్, పాకిస్థాన్ మధ్య ఏ క్రీడలోనైనా ఉత్కంఠ తారా స్థాయిలో ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. ఈ రెండు దేశాల మధ్య మ్యాచ్ అంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రీడాభి మానులు ఆసక్తిగా చూస్తుంటారు. హాకీ, క్రికెట్ వంటి క్రీడల్లో ఉన్న ఈ దాయాదుల పోరు తాజాగా బాక్సింగ్ రింగ్‌కు కూడా పాకింది. అయితే ఈ ఆట ప్రారంభం కావడానికి ముందే దుబా య్‌లో ఓ హైడ్రామా చోటు చేసుకుంది. బాక్సింగ్ బౌట్ ప్రమో షనల్ ఈవెంట్‌లో భాగంగా జరిగిన ఫేస్‌ఆఫ్‌లో భారత బాక్సర్, ప్రముఖ యూట్యూబర్ మనీశ్ శర్మ (హాఫ్ ఇంజనీర్) పాకిస్థాన్ ఫైటర్ రహీమ్ పరదేసీని చెంపదెబ్బ కొట్టాడు. తొలుత పాకిస్థాన్ బాక్సర్ రహీమ్ వేదికపై మనీశ్‌ను రెచ్చగొట్టేలా ఓవరాక్షన్ చేశాడు. దీంతో అతడికి చెంపదెబ్బతో మనీశ్ సమాధానం ఇచ్చాడు. ఈ ఊహించని పరిణామంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే వారిద్దరినీ వేరుచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోపై నెటిజన్లు తెగ కామెంట్స్ చేస్తున్నారు.



కిషోర్ మూవీ మేకర్స్ తొలి సినిమా ప్రారంభం



కిషోర్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మాత ఎన్.ఎన్. కిషోర్ నిర్మిస్తోన్న తొలి చిత్రం ప్రొడక్షన్ నెంబర్ 1 హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో సినీ ప్రముఖులు, అతిథుల సమక్షంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమా పూజా కార్యక్రమాలకు సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి. వినాయక్, ప్రామిసింగ్ హీరో ఆది సాయికుమార్ ముఖ్యఅతిథులుగా హాజర య్యారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు వి.వి.వినాయక్ చిత్ర బృందానికి స్క్రిప్ట్ అందజేసి శుభాకాంక్షలు తెలియజేయగా.. ముహూర్తపు షాట్‌కు నిర్మాత ఎన్.ఎన్.కిషోర్ క్లాప్ కొట్టారు. ఆది సాయికుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర యూనిట్‌కు అభిన ందనలు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు నిర్మాత మల్కా పురం శివకుమార్, సిద్ధు రెడ్డి, చీకోటి ప్రవీణ్ వంటి వారంతా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు పలువురు సినీ ప్రముఖులు, నటీనటులు, దర్శకులు, నిర్మాతలు పాల్గొని చిత్ర బృందానికి బెస్ట్ విషెస్ తెలియజేశారు. ఈ సినిమాతో దర్శకులు రవికుమార్ చౌదరి, ఘటికాచలం వద్ద రచయితగా అసోసియేట్‌గా పనిచేసిన దివాకర్ యడ్ల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఓ అందమైన ప్రేమకథతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వినోదాత్మక అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'డెలులు' చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న విజయ్ రాజ్‌కుమార్ హీరోగా నటిస్తుండగా.. కన్నడ చిత్రం 'కెజియఫ్'లో యశ్ తల్లిగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న అర్చనా జోయస్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'అర్జున్ రెడ్డి', 'అమీతుమీ' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అతిథి మైకిల్ ఓ కీలక పాత్రలో కనిపించ నున్నారు.

దీపావళి బరిలో డబ్బింగ్ సినిమాల హవా





గత యేడాది దీపావళికి చెప్పుకోదగ్గ పెద్ద సినిమాలు విడుదల కాకపోయి నా, 'కె-ర్యాంప్', 'తెలుసు కదా', 'మిత్ర మండలి' వంటి స్ట్రయిట్ చిత్రాలతో పాటు తమిళ అనువాద చిత్రం 'డ్యూడ్' విడుదలైంది. ఇందులో 'డ్యూడ్', 'కె-ర్యాంప్' మాత్రమే ప్రేక్షకాదరణ పొందా యి. కానీ ఈసారి దీపావళి సీజన్‌లో డబ్బింగ్ సినిమాలదే హవా! దీపావళి పండగ నవంబర్ 8వ తేదీ కాగా మూడురోజుల ముందే గురువారం హిందీ అనువాద చిత్రం'రామాయణం' వస్తోంది. భారతదేశంలోని వివిధ ప్రధాన భాషల్లో ఈ సినిమాను అను వదించి, భారీఎత్తున విడుదల చేస్తున్నా రు. అలానే నయనతార నాయికగా సుందర్ సి దర్శక త్వంలో రూపుదిద్దు కున్న 'మహాశక్తి' చిత్రం తెలుగులో రాబోతోంది. తమిళంలో వచ్చిన 'మూకుత్తి అమ్మన్' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగానికి ఆర్.జె. బాలాజీ దర్శకత్వం వహించగా, ఈ సీక్వెల్‌ను సుందర్ సి రూపొందించా రు. తమిళ స్టార్‌హీరో సూర్య నటించిన రెండు సినిమాలు ఈ యేడాది ఇప్ప టికే విడుదలై మంచివిజయాన్ని సాధిం చాయి. 'కరుప్పు' సినిమా ఏకంగా రూ.300కోట్ల గ్రాస్‌ను వసూలు చేసిం ది. ఇదితెలుగులో 'వీరభద్రుడు'గా డబ్ అయ్యింది. అలానే సూర్య ఈ యేడాది నటించిన రెండో సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి తెరకెక్కిం చిన ఈ సినిమా రూ.200కోట్ల గ్రాస్ ను సంపాదించింది.ఇప్పుడు ఈ యేడా ది ముచ్చటగా మూడో సినిమా 'సీన్' నవంబర్ 6న రాబోతోంది. ఇలా ఈ యేడాది దీపావళికి మూడు భారీ అను వాద చిత్రాలు విడుదల అవుతుంటే... ఒకే ఒక్క స్ట్రయిట్ తెలుగు సినిమాగా 'సమ్మర్ హాలిడేస్' వస్తోంది. నిజానికి దీపావళి పండక్కే కిరణ్ అబ్బవరం నిర్మించిన 'హతః' సినిమా విడుదల కావాల్సింది.కానీ దీనిని వాయిదా వేశా రు.కొత్త రిలీజ్‌డేట్ ప్రకటించాల్సిఉంది. ఇక విజయ్ ఆంటోనీ నటించిన 'నాన్న కుట్టి' సినిమాను కూడా నవంబర్ 6న విడుదల చేస్తామని తొలుత ప్రకటించా రు కానీ ఆతర్వాత దాని విడుదల తేదీ ని నవంబరు 20కి వాయిదా వేశారు. ఏదేమైనా... ఈ యేడాది దీపావళికి డబ్బింగ్ సినిమాల సౌండ్‌గా ఎక్కువగా ఉండబోతోంది.



మాయ లేడీ ట్రైలర్..

ట్విన్ సిస్టర్స్‌తో హీరో రొమాన్స్



విలన్‌గా కెరీర్ మొదలుపెట్టి.. మిర్చి, బాహుబలి వంటి చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు రాకేష్ వర్రే. ఎవరికీ చెప్పొద్దు సినిమాతో హీరోగా మారాడు. ఆ తరువాత నిర్మాత గా మారి పేకమేడలు సినిమాని తెరకెక్కిం చిన విషయం తెల్సిందే. ఈసినిమా ఆశిం చిన ఫలితాన్ని అందుకో లేకపోయింది. ఇక ప్రస్తుతం 'మాయ లేడీ' అనే సినిమా తో ప్రేక్షకుల ముందకు రానున్నాడు. రొమాంటిక్ కామెడీ ఎంట ర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకి ప్రశంకర్ దర్శ కత్వం వహించగా రాకేష్ వర్రే తనసొంత బ్యానర్‌లోనే నిర్మించాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. తాజాగా మాయ లేడీ ట్రైలర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తుంది. క్రిష్ (రాకేష్ వర్రే) పిల్లలకు కరాటే నేర్పిస్తూ ఉంటాడు. అత నికి ఒక పట్టాన అమ్మాయిలు నచ్చరు. తనకు కరెక్ట్ అమ్మాయి దొరికేవరకు ఎదు రుచూస్తూ ఉంటాడు. ఇక అనుకోకుండా క్రిష్ లైఫ్‌లోకి ఆశ(మధుమిత) వస్తుంది. ఇద్దరి మధ్య ప్రేమ మొదలవుతుంది. సడెన్‌గా ఆశ వేరేలా మారిపో తుంది. అయితే ట్విస్ట్ ఏంటంటే.. ఆశ, రూప ట్విన్ సిస్టర్స్. క్రిష్ ని ఇద్దరూ ప్రేమిస్తారు. కానీ, క్రిష్ మాత్రం ఆశనే ప్రేమిస్తాడు. మరి చివరికి ఇద్దరి అక్కాచెల్లెళ్ల మధ్య ఇరు క్కున్న క్రిష్ ఏమై పోయాడు? ఎవరిని పెళ్లాడాడు? అనేది సిని మా చూసి తెలుసుకోవాల్సిందే.

ఎన్టీఆర్ వదిలిన ఇట్లు అర్జున ట్రైలర్

కొత్త కుర్రాడు అనీష్, మలయాళ భామ అనస్వర రాజన్ జంటగా నటించిన చిత్రం 'ఇట్లు అర్జున'. డెబ్యూ డైరెక్టర్ మహేష్ ఉప్పాల తెరకెక్కించిన ఈ సిని మాని డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మించ గా.. అక్కినేని నాగార్జున సమర్పించాడు. ఇప్పటికే ఈచిత్రం నుంచిరిలీజైన పోస్టర్స్, టీజర్, సాంగ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్ర అధి కారిక ట్రైలర్‌ను యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా లాంచ్ చేశారు. ఎన్టీఆర్ చేతులమీదుగా ట్రైలర్ వెలువడటంతో ఈ చిన్న చిత్రంపై ఒక్క సారిగా పాన్-ఇండియా రేంజ్‌లో అంచనాలు పెరిగిపోయాయి. ట్రైలర్ ఆద్యం తం ఆకట్టుకుంటుంది. అర్జున్‌కి చిన్నతనం నుంచి మాటలు రావు. చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఉంటాడు. మాటలు రాకపోవడంతో తన ఇంటి పక్క నే ఉండే కీర్తికి తన ప్రేమను చెప్పలేకపో తాడు. అయితే విచిత్రంగా ఎవరికీ అర్థం కానీ అర్జున్ భాష..కీర్తికి అర్థమవుతుంది. వీరిద్దరి మధ్య చిన్నగా ప్రేమ చిగురిస్తున్న సమయంలో అర్జున్ అనుకోకుండా ఒక డాన్ దగ్గర ఉన్న పెన్ డ్రైవ్‌ని కొట్టేస్తాడు. దానికోసం పెద్దన్నరంగంలోకి దిగుతాడు. ఆ పెన్ డ్రైవ్‌లో ఏముంది? అర్జున్-కీర్తి కలిసి ఆ డాన్‌ని ఎలా ఎదుర్కుంటారు?



చివరికి అర్జున్ - కీర్తి ఒక్కటవుతారా.. లేదా? అనేది సినిమా చూసి తెలుసు కోవాల్సిందే. ట్రైలర్‌తో ఒక్కసారిగా సినిమాపై అంచనాలను పెంచేశారు. నవంబరు 13న ఇట్లు అర్జున ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ సినిమాతో న్యూ గాయ్ అనీష్ హిట్ అందు కుంటాడా.. లేదా అనేది చూడాలి.

క్రిస్మస్ బరిలో హాలీవుడ్ వర్సెస్ ఇండియన్ స్టార్స్

సంక్రాంతి బరిలో టాప్‌స్టార్స్ మూవీస్ ఢీకొనడం చూస్తూనే ఉంటాం... ఆ సమయంలో పరభాషా చిత్రాల అనువాదాలు కూడా బరిలోకి దూకినా తెలుగు సినిమాల సందడే ఓ రేంజ్ లో ఉంటుంది. అయితే ఈ సారి క్రిస్మస్‌కు కూడా ఆ తరహా హంగా మా కనిపించనుంది. ప్రతి క్రిస్మస్‌కు హాలీవుడ్‌లో క్రేజీ ప్రాజెక్ట్స్ వెలుగు చూస్తూనే ఉంటాయి. అయితే బిగ్ బడ్జెట్ మూవీస్ కోసం ప్రేక్షకులు సైతం ఆసక్తిగా ఎదురుచూస్తూ ఉంటారు. ఈ సారి క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25వ తేదీన రెండు హాలీవుడ్ సినిమాలు రిలీజ్ కానున్నాయి. 'జుమాన్జీ' సిరీస్ లో 'ఓపెన్ వరల్డ్' డిసెంబర్ 25న రానుంది. అదేరోజున లూకా గాడగ్నినో దర్శక త్వంలో తెరకెక్కిన 'ఆర్టిఫిసియల్' కూడా వెలుగు చూడనుంది. ఈ సినిమాలకంటే ఓ రోజు ముందుగా బాలకృష్ణ 'దాదా', నాగార్జున 'కింగ్ 100', షారుఖ్ ఖాన్ 'కింగ్' చిత్రాలు విడుదల కానున్నాయి. అలా హాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్స్ తోనే తలపడుతున్న మన సీనియర్ స్టార్స్ గురించి అటు ముంబైలో, ఇటు హైదరాబాద్ లోనూ విశేషంగా చర్చించుకుంటున్నారు. క్రిస్మస్‌కు ఓ వారం ముందు అంటే డిసెంబర్ 18వ తేదీన మరో రెండు హాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్స్ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. వాటిలో 'అవెంజర్స్: డూమ్స్ డే' ఒకటి కాగా, మరోటి 'డ్యూన్ - పార్ట్ త్రీ'. ఈ రెండు చిత్రాల ప్రీక్వెల్స్ ఇప్పటికే జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ నేప థ్యంలోనే ఈ రెండు సినిమాలు మన దేశంలోనూ భారీ స్థాయిలో విడుదలవుతున్నాయి. ఈ రెండు చిత్రాల కోసం మన దేశంలో నార్త్, సౌత్ అన్న తేడాలేకుండా అన్ని చోట్లా క్రేజీ థియేటర్స్ నే బ్లాక్ చేశారు. ఈ సినిమాలు వచ్చిన ఆరు రోజులకే బాలయ్య 'దాదా', నాగ్ 'కింగ్ 100', షారుఖ్ 'కింగ్' వస్తున్నాయి.



ఈ రెండు సినిమాల్లో ఏది హిట్ టాక్ సంపాదించినా, మన ఇండియన్ మూవీస్‌ను చూసేందుకు ప్రేక్షకులు అంతగా ఇంట్రెస్ట్ చూపించరని పరిశీలకులు భావిస్తున్నారు. ఒకవేళ మన సీనియర్ స్టార్స్ మూడు చిత్రాలు గుడ్ టాక్ సంపాదిస్తే తరువాతి రోజు వచ్చే హాలీవుడ్ మూవీస్‌కు దెబ్బ పడుతుందనీ అంటున్నారు. ఇలా మొత్తానికి హాలీవుడ్ సినిమాలకు మన సీనియర్ స్టార్స్ చిత్రాలు గుబులు పుట్టిస్తున్నాయి. బాలకృష్ణ, నాగార్జున, షారుఖ్ ఖాన్ ముగ్గురూ ఒకప్పుడు క్రిస్మస్ కు బంపర్ హిట్స్ చూసినవారే. అందువల్ల అదే కాన్ఫిడెన్స్‌తో తమ సినిమాలను రిలీజ్ చేస్తున్నారు ఈ స్టార్స్. ఈ ముగ్గురి చిత్రాలు మన దేశంలోనే కాదు అమెరికాలోనూ రిలీజ్ అవుతున్నాయి. పలు హాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్స్ ఉండగా, అక్కడ మన ఇండియన్ మూవీస్ కు సరైన థియేటర్స్ లభిస్తాయా అన్నది మరో ప్రశ్న. ఏది ఏమైనా హాలీవుడ్ బిగ్ మూవీస్ తోనే పోటీకి సై అంటున్న ఈ మూడు చిత్రాలు యు.ఎస్.లోనూ చర్చకు తెరలేపడం గమనార్హం. మరి మన ముగ్గురు సీనియర్ స్టార్స్‌లో ఎవరి సినిమా ఏ తీరున మురిపి స్తుందో చూడాలి.